TGTEL/25/A3603

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

PUBLISHED FROM HYDERABAD AND VIJAYAWADA

హైదరాబాద్ సంపుటి: 01 సంచిక : 217 మంగళవారం,జూన్ 23,2026 పేజీలు :8 వెల.1/-

ఆరోగ్యవంతమైన మెడ్చల్ కోసం నమ్మకమైన వైద్య నిపుణులు
అత్యుత్తమమైన సేవలు,
ప్రతి అడుగులో మరింత శ్రద్ధ.
జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్
మా ప్రత్యేకతలు
• అత్యవసర & క్రిటికల్ కేర్
• ప్రమాద సేవలు
• ప్రస్తూతి & గైనకాలజీ
• ఆర్థోపెడిక్స్
• జాయింట్ రీప్లేస్‌మెంట్స్
• జనరల్ మెడిసిన్
• జనరల్ సర్జరీ
• మ్యాక్సిలో ఫేషియల్ సర్జరీ
• పిల్లల వైద్యం & శిశు సంరక్షణ
• న్యూరాలజీ • న్యూరోసర్జరీ
• ప్లాస్టిక్ సర్జరీ • పల్మనాలజీ
• యూరాలజీ • డెర్మటాలజీ
• సైకియాట్రీ • ఫిజియోథెరపీ


నమ్మకమైన వైద్యం | నైతిక వైద్య సేవలు | చికిత్సే ముందుగా | నిపుణుల క్లినికల్ సంరక్షణ
అన్ని ఇన్సూరెన్స్ క్యాష్‌లెస్ సౌకర్యం | 24/7 అత్యవసర సేవలు | అత్యాధునిక అంబులెన్స్
+91 85230 89599 +91 86889 09384
www.jaitrahospitals.com • ITI పక్కన, NH 44, చంద్ర నగర్, మెడ్చల్, తెలంగాణ - 501401.

## సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలి



**జిల్లాకో మండలంలో ఇంటిగ్రేటెడ్ భూభారతి అమలుకు యోచన**

**ఏడాది కాలంలో 3.65 లక్షల పాస్‌బుక్‌ల జారీ**

**రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

హైదరాబాద్ జూన్ 22.రైతు భూమికి చట్టబద్ధమైన రక్షణ, స్పష్టమైన హక్కులు కల్పించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార �్ పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో భూసమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తూ ముందుకు సాగుతోందన్నారు. సోమవారం నాడు రెవెన్యూ అధికారులతో నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి గారు మాట్లాడుతూభూభారతి చట్టం అమల్లోకి వచ్చిన 2025 ఏప్రిల్ 14 నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 3.65 లక్షల పాస్‌బుక్‌లు జారీ చేసినట్లు వెల్లడించారు. గతంలో పాస్‌బుక్ కోసం రైతులు నెలల తరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేదని, ఇప్పుడు ఆ పరిస్థితులకు ముగింపు పలుకుతూ రైతు దరఖాస్తు చేసిన వెంటనే పాస్‌బుక్ అందే విధంగా వ్యవస్థను పారదర్శకంగా, వేగవంతంగా రూపొందించామని చెప్పారు. రైతు ఒక్కసారి దరఖాస్తు చేస్తే తిరిగి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా సేవలు అందేలా చూడాలని స్పష్టం చేశారు.

## ప్ర రా బి నేటిమాట..

మధురభాషణ, సత్ప్రవర్తన, సత్కర్మ, సత్సంగం, సద్గురు సేవ... మనిషిని ఉన్నత పీఠంపై నిలబెడతాయి. 'వృద్ధాప్యంలో నీకు తిండి పెట్టేది నీ సంతానం కాదు.

నీ సంతానానికి నువ్వు నేర్పిన సంస్కారం' అన్నారు ఒకానొక సందర్భంలో తనను కలిసేందుకు వచ్చిన భక్తజనాలతో శ్రీరామకృష్ణ పరమహంస. అలాంటి సంస్కారవంతుల అవసరం ఇప్పుడు చాలా ఉంది...

- ప్రమీల రాణి బి

# కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సీఎం రేవంత్ భేటీ..

### తెలంగాణ అభివృద్ధిపై కీలక చర్చలు



ఢిల్లీ, జూన్ 22 : కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించారు. గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ భూములు బదలాయించినందుకు రాజ్‌నాథ్ సింగ్‌కు.. సీఎం కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యమిస్తోన్న ప్రాజెక్టుల్లో ఒకటైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి సంబంధించి తమ ప్రభుత్వం భూ సేకరణ, యుటిలిటీస్ బదలాయింపు వంటి అంశాల్లో పూర్తి సహకారం అందిస్తామని కేంద్రమంత్రికి తెలిపారు రేవంత్‌రెడ్డి.దేశ సమగ్రత, రక్షణకు సంబంధించిన అంశం కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహాయ, సహకారాలు అందిస్తామని కేంద్రమంత్రికి స్పష్టం చేశారు సీఎం. ఆదిలాబాద్‌లో రానున్న భారతీయ వాయుసేన ఎయిర్‌పోర్ట్‌ను భారీగా విస్తరిస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్నివిధాలా సహకరిస్తామని వివరించారు. భారత వాయుసేన టెర్మినల్‌తో పాటు ప్రయాణికుల సౌకర్యార్థం నిర్మించనున్న పౌర విమానయాన శాఖకు చెందిన టెర్మినల్ బిల్డింగ్‌తో పాటుగా కార్గో, ఎమార్వో (ఓఖీో), హ్యాంగర్ (ఊంఔఉ ఇఖీ) సౌకర్యాలను పెద్దఎత్తున ఏర్పాటు చేసేలా సహకరించాలని కోరారు ముఖ్యమంత్రి.ఇటీవల పశ్చిమాసియాలో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఎయిర్‌లైన్స్ తమ హ్యాంగర్స్‌ను ఏర్పాటు చేసుకోవడానికి అత్యంత అనుకూలమైన ఆదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌ను ఆ దిశగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు సీఎం. తెలంగాణ రాష్ట్రంలోని మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో డీఆర్డీవో/డీఆర్‌డీఎల్ ఎంచుకున్న ప్రదేశంలో వారికి సంబంధించిన కీలకమైన ప్రాజెక్ట్‌ను త్వరగా మంజూరు చేయాలని కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.

## జీరాంజీపై ఇతర రాష్ట్రాలతో కలిసి పోరాడతాం

### అవసరమైతే సుప్రీంకోర్టుకెళ్తాం: మంత్రివర్గ ఉపసంఘం



హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం జులై 1 నుంచి అమలు చేయనున్న జీరాంజీకి వ్యతిరేకంగా భాజపాయేతర పార్టీలు పాలించే రాష్ట్రాలతో కలిసి ఉమ్మడిగా పోరాడాలని రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. అవసరమైతే అన్ని రాష్ట్రాలు కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశాన్ని కూడా పరిశీలించాలని అభిప్రాయపడింది. పథకంపై ప్రభుత్వానికి సమగ్ర సిఫార్సులు అందించేందుకు అంశాలవారీగా అధ్యయనం కొనసాగించాలని గ్రామీణ సంక్షేమం, ఉపాధి భద్రత, రాష్ట్రాల హక్కుల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని తుది నివేదిక రూపొందించాలని తీర్మానించింది. ఆదివారం పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘ సమావేశం జరిగింది. పంచాయతీరాజ్, వ్యవసాయం, కార్మికశాఖల మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్‌లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్, ప్రత్యేక కమిషనర్ లక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్త చట్టం వల్ల గ్రామీణుల ఉపాధి, స్థానిక సంస్థలు, వ్యవసాయ రంగంపై కలిగే ప్రభావాలపై చర్చించారు. క్షేత్రస్థాయి పరిస్థితులు, గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలు, కూలీల జీవనోపాధిపై చట్టం ప్రభావం వంటి అంశాల గురించి అధికారులు వివరించారు. కొత్త చట్టంలో ప్రతిపాదించిన 60 రోజుల ఉపాధి విరామం అమలు సాధ్యం కాదని మంత్రులు అన్నారు. దీనివల్ల కూలీలకు ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో పాటు కూలి రేట్లపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రాలను సంప్రదించకుండా కేంద్ర ప్రభుత్వం 40% నిధుల భారాన్ని మోపడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలతో పాటు భాజపాయేతర పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలతోనూ సంప్రదింపులు జరపాలని సమావేశం నిర్ణయించింది. మరో రెండు మూడు రోజుల్లో సబ్ కమిటీ మరోసారి సమావేశమై తదుపరి కార్యాచరణపై చర్చించాలని నిర్ణయం తీసుకుంది.

## భారత్‌కు సహాయం..

### కీలక ఆయుధాల సర్వీసులకు అమెరికా సిద్ధం..

భారత్‌కు చెందిన కీలక రక్షణ వ్యవస్థల నిర్వహణ, సాంకేతిక మద్దతు కోసం అమెరికా సహాయం చేయబోతోంది. ఈ మేరకు అమెరికా 428.2 మిలియన్ డాలర్ల (సుమారు రూ.3,600 కోట్లకు పైగా) విలువైన రెండు రక్షణ సహాయ ప్యాకేజీలకు ఆమోదం తెలిపింది. ఈ ప్యాకేజీలను కొత్త ఆయుధాల కొనుగోలు కోసం కాకుండా ఇప్పటికే భారత సైన్యంలో సేవలందిస్తున్న వ్యవస్థల నిర్వహణ, శిక్షణ, విడిభాగాల సరఫరా కోసం కేటాయించారు. ఈ విషయాన్ని అమెరికా కాంగ్రెస్‌కు విదేశాంగ శాఖ తెలియజేసిందిఅమెరికా ఇవ్వనున్న 428.2 మిలియన్ డాలర్ల ప్యాకేజీలో 198.2 మిలియన్ డాలర్లను ఏహెచ్-64ఈ అపాచీ యుద్ధ హెలికాప్టర్ల నిర్వహణ కోసం కేటాయించారు ఇందులో ఇంజినీరింగ్ సేవలు, సాంకేతిక సహాయం, లాజిస్టిక్ మద్దతు, శిక్షణ వంటి అంశాలు ఉన్నాయి. ఈ ప్యాకేజీకి బోయింగ్, లాక్‌హీడ్ మార్టిన్ సంస్థలు ప్రధాన కాంట్రాక్టర్లుగా ఉంటాయి.మరో 230 మిలియన్ డాలర్ల ప్యాకేజీని ఎం-777 ఏ2 అల్ట్రా-లైట్ హోవిట్జర్ తుపాకుల నిర్వహణకు కేటాయించారు . దీనిలో విడిభాగాలు, సాంకేతిక సహాయం, శిక్షణ, లాజిస్టిక్ మద్దతు వంటి సేవలు ఉంటాయి. ఈ కార్యక్రమానికి ప్రధాన కాంట్రాక్టర్‌గా బీఏఈ సిస్టమ్స్ వ్యవహరించనుంది.ఈ ఒప్పందాలు ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని అమెరికా విదేశాంగ శాఖ పేర్కొంది . ఈ సహాయం ద్వారా ప్రస్తుత, భవిష్యత్తు భద్రతా సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనే సామర్థ్యాన్ని భారత్ పెంచుకుంటుందని తెలిపింది.




హైదరాబాద్ : తెలంగాణలోని అన్నదాతలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీపి కబురు అందించింది.ఆర్థిక భారం ఎక్కువైనా సరే ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. ఈనెల 30న ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలో జరగనున్న భారీ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఈ నిధులను విడుదల చేయనున్నారు.ఈ విడతలో మొత్తం 73 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ. 9,000 కోట్లను జమ చేసేందుకు ప్రభుత్వం పక్కా ప్రణాళికను సిద్ధం చేసింది.గత యాసంగి సీజన్‌లో కేవలం రెండు

# రైతు భరోసా: సీఎం రేవంత్ రెడ్డి

ఎకరాల లోపు ఉన్న వారికే పెట్టుబడి సాయం అందించడంతో రైతుల నుంచి కొంత వ్యతిరేకత వచ్చింది. ఈసారి ఆ పరిస్థితి రాకుండా అందరికీ ఒకేసారి నిధులు జమ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఒకవేళ నిధుల కొరత ఏమైనా ఎదురైతే, మొదట ఎకరం చొప్పున ప్రారంభించి, 9 రోజుల్లో పూర్తిగా పంపిణీ పూర్తి చేసేలా వ్యవసాయ శాఖ ప్రత్యామ్నాయ ప్లాన్‌ను కూడా సిద్ధం చేసుకుంది. గత ప్రభుత్వంలా కాకుండా.. ప్రజల సొమ్ము వృథా కాకుండా కేవలం నిజమైన, సాగు చేసే రైతులకే ఈ సాయం అందేలా రేవంత్ ప్రభుత్వం కఠిన నిర్ణయాలు తీసుకోబోతోంది. రాష్ట్రంలో ఉన్న 1.50 కోట్ల ఎకరాల భూమిలో సాగుకు పనికిరాని పడావు భూములు, రియల్ ఎస్టేట్ లేఅవుట్లు, కాలువలు, కుంటలు, బీడు భూములు ఉన్న 20 నుంచి 25 లక్షల ఎకరాలను భరోసా జాబితా నుంచి ఇప్పటికే తొలగించనున్నారు.ధనవంతులైన పెద్ద రైతులకు కాకుండా పేద, మధ్యతరగతి రైతులకు లబ్ధి చేకూర్చేలా ఈ వానాకాలం సీజన్ నుంచి 7.20 గుంటల వరకు భూమి ఉన్న వారికే భరోసా సాయం పరిమితం చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. 10 ఎకరాల కంటే ఎక్కువ భూమి ఉన్నవారిని ఈ జాబితా నుంచి మినహాయించే అవకాశం ఉంది. పత్తి వంటి పంటలు రబీలో సాగు చేయనందున,రైతు భరోసాను కేవలం ఒకే ఒక ప్రధాన ఖరీఫ్ సీజన్‌కే పరిమితం చేయాలా? అనే కోణంలోనూ ప్రభుత్వ పెద్దలు సమాలోచనలు చేస్తున్నారు. ఎన్నికల హామీ ప్రకారం ఎకరానికి రూ. 15 వేలు ఇస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీకి తిరుగుండదని, అలాగే కౌలు రైతులను ఆదుకునేందుకు ఒక ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని కొందరు మంత్రులు సీఎంకు ప్రతిపాదనలు పెట్టారు.ఇకపై రైతు భరోసాలో ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావులేకుండా ప్రభుత్వం హైటెక్ టెక్నాలజీని వాడుతోంది. వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో స్విట్జర్లాండ్ దేశానికి చెందిన సార్ మ్యాప్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని శాటిలైట్ చిత్రాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా సర్వే నిర్వహించారు.ఈ సర్వే ద్వారా రాష్ట్రంలో ఏ గ్రామంలో, ఏ సర్వే నంబర్‌లో, ఏ పంట వేశారనేది 95 శాతం ఖచ్చితత్వంతో గుర్తించారు.పైలట్ ప్రాజెక్ట్ కింద జిల్లాకు 5 గ్రామాలను ఎంపిక చేసి ఏఈఓ లతో క్షేత్రస్థాయిలో సర్వే చేయించగా శాటిలైట్ వివరాలు, క్షేత్రస్థాయి వివరాలు ఒక్కటిగానే వచ్చాయి. దీనివల్ల కేవలం పంట సాగు చేసిన వారికే ప్రభుత్వ పథకాలు అందుతాయి. అంతేకాకుండా ప్రకృతి విపత్తుల వల్ల పంట నష్టపోతే నేరుగా నష్టపరిహారం అందించడానికి, విత్తనాలు-ఎరువులు ముందే సిద్ధం చేసుకోవడానికి ఈ డేటా ప్రభుత్వానికి ఎంతో ఉపయోగపడనుంది. ప్రభుత్వం తీసుకోబోతున్న ఈ విప్లవాత్మక మార్పులతో నిజమైన పేద రైతులకు పూర్తి స్థాయిలో భరోసా దక్కనుందని స్పష్టమవుతోంది.

## కెటిఆర్ ఎన్ని మాయమాటలు చెప్పినా.. ప్రజలు వినే పరిస్థితి లేదు: మహేష్ గౌడ్



హైదరాబాద్: దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి విలువ లేకుండా చేశారని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. రాజ్యసభలో బిజెపి నేతలను ప్రశ్నిస్తుందనే మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరించారని అన్నారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో 'సర్' పై బిఎల్ ఎలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. 'సర్'పై బిఎల్‌ఎల శిక్షణ కార్యక్రమానికి పిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, మీనాక్షి నటరాజన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. దేశానికి చక్రవర్తులమనే భావనలో ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా ఉన్నారని తెలియజేశారు. పదేళ్లు దోపిడీ చేసి..ఇప్పుడు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, బిఆర్ఎస్ దోపిడీని ప్రజలు మరిచిపోయారని కెటిఆర్ అనుకుంటున్నారని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. కెటిఆర్ ఎన్ని మాయమాటలు చెప్పినా.. ప్రజలు వినే పరిస్థితి లేదని, ఆస్తి కోసం సొంత చెల్లినే బయటకు గెంటేసిన చరిత్ర కెటిఆర్ ది అని చెల్లిని గెంటేసి ఇప్పుడు తెలంగాణ ఆడబిడ్డల గురించి కెటిఆర్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించారని, అధికారం పోయిందనే అక్కసు కెటిఆర్ లో కనిపిస్తోందని ధ్వజమెత్తారు. తమ పాలనలో అభివృద్ధి, సంక్షేమాన్ని రెండు కళ్లలా చూస్తున్నామని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# నష్టాల బాటలో ఎల్ ఐసీ





ముంబై, జూన్ 22, (న్యూస్ పల్స్)స్టాక్ మార్కెట్ అంటేనే ఒడుదొడుకులు ఉంటాయ. విపరీతమైన రిస్క్ ఉంటుంది. ఏ కారణాలతో సూచీలు రాణిస్తాయో, ఏ కారణాలతో పడతాయో, ఏ స్టాక్ ఎప్పుడు పెరుగుతుందో ఎప్పుడు ఎందుకు పడుతుందో ముందుగానే ఊహించడం కాస్త కష్టమే. ఎన్నో అంశాలు ఇక్కడ ముడిపడి ఉంటాయి. ఈ ఏడాది మార్చి నుంచి దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీగా పతనమైన సంగతి తెలిసిందే. అమెరికా- ఇరాన్- ఇజ్రాయెల్ ఉద్రిక్తతలు ఇందుకు కారణం. క్రూడాయిల్ ధరలు విపరీతంగా పెరగడంతో స్టాక్ మార్కెట్లలో కూడా నష్టాలు వచ్చాయి. విదేశీ పెట్టుబడిదారులు పెద్ద మొత్తంలో తమ పెట్టుబడుల్ని ఉపసంహరించుకోవడంతో అమ్మకాల ఒత్తిడి నెలకొంది. దీంతో ఆ మధ్య భారత మార్కెట్ సూచీలు భారీగా తగ్గాయి.ఇటీవల అమెరికా- ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరగా సూచీలు పుంజుకున్నాయి. కిందటి వారంలో జూన్ 15- 19 మధ్య 5 ట్రేడింగ్ సెషన్లలో బొంబాయి స్టాక్ ఎక్స్చేంజి సూచీ సెన్సెక్స్ 1275 పాయింట్లు లేదా 1.68 శాతం ఎగబాకింది. ఈ క్రమంలోనే ఆయా కంపెనీల షేర్లు పుంజుకున్నాయి. టాప్- 10 కంపెనీల్లో 9 కంపెనీల మార్కెట్ వాల్యుయేషన్ రూ. 2.15 లక్షల కోట్ల మేర పెరగడం విశేషం. ఆయా కంపెనీల మార్కెట్ విలువనే మదుపరుల సంపదగా పరిగణిస్తుంటారు. దీంతో ఈ మేర ఇన్వెస్టర్లకు కూడా భారీగా లాభాలు వచ్చాయని చెప్పొచ్చు.ఇక గత వారంలో అత్యధికంగా భారతీ ఎయిర్‌టెల్ మార్కెట్ విలువ 5 రోజుల వ్యవధిలో రూ. 52,432.67 కోట్లు పెరిగి రూ. 11.62 లక్షల కోట్లకు చేరుకుంది. లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఒఎఅ) మార్కెట్ క్యాపిటలైజేషన్ కూడా రూ. 51,675.23 కోట్లు పెరగడంతో ఇప్పుడు రూ. 5.56 లక్షల కోట్లుగా ఉంది. బజాజ్ ఫైనాన్స్ మార్కెట్ వాల్యుయేషన్ రూ. 26,553 కోట్లు పెరగడంతో ప్రస్తుతం రూ. 5.98 లక్షల కోట్లకు చేరుకుంది.మార్కెట్ విలువ పరంగా భారత్‌లో అతిపెద్ద కంపెనీగా ఉన్నటువంటి రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎం- క్యాప్ గత వారం రూ. 22,464 కోట్లు పెరగడంతో రూ. 17.71 లక్షల కోట్లుగా ఉంది. లార్సెన్ అండ్ టుబ్రో ఎం- క్యాప్ రూ. 21,929 కోట్లు పెరిగి రూ. 5.79 లక్షల కోట్లుగా ఉంది. ఎస్బీఐ మార్కెట్ విలువ 5 రోజుల్లో రూ. 16 వేల కోట్లకుపైగా పెరగడంతో ప్రస్తుతం ఎం క్యాప్ రూ. 9.55 లక్షల కోట్లకు చేరుకుంది.అతిపెద్ద ప్రైవేట్ బ్యాంక్ ఊఆఈఅ బ్యాంక్ మార్కెట్ విలువ రూ. 11,948 కోట్లు పెరిగి రూ. 12.01 లక్షల కోట్ల వద్ద ఉంది. హిందుస్థాన్ యూనిలివర్ మార్కెట్ విలువ రూ. 6661 కోట్లు పెరిగి రూ. 5.15 లక్షల కోట్లుగా ఉంది. ఐసీఐసీఐ బ్యాంక్ ఎం క్యాప్ గత వారంలో రూ. 4724 కోట్లు పెరిగి రూ. 9.66 లక్షల కోట్ల వద్ద ఉంది. ఇదిలా ఉండగా అతిపెద్ద భారత ఐటీ కంపెనీ టీసీఎస్ మార్కెట్ విలువ కిందటి వారం రూ. 12,699 కోట్లు తగ్గి రూ. 7.69 లక్షల కోట్లుగా నమోదైంది.

# ధర్మస్థలి వివాదం వెనుక ప్రకాష్ రాజ్

## నాలుగు రాష్ట్రాల కేసులు

బెంగళూరు, జూన్ 22 (న్యూస్ పల్స్)మధ్య కర్ణాటక రాష్ట్రంలో ధర్మస్థల వివాదం చోటు చేసుకున్న విషయం తెలిసిందే. అది కాస్త దేశంలోనే సంచలనం కలిగించింది. ఆ తర్వాత ఈ ఎపిసోడ్ లోకి ప్రకాష్ రాజ్ ప్రవేశించారు. తీవ్రాతీతీవ్రమైన వ్యాఖ్యలు చేశారు.. అక్కడితోనే ఆగిపోలేదు.. హిందువుల మీద.. హిందూ ధర్మం మీద దారుణంగా మాట్లాడారు. జస్ట్ ఆస్కింగ్ పేరుతో ధర్మస్థల అంశం మీద ఏదో ఒక విషయాన్ని ప్రకాష్ రాజ్ తెర పైకి తీసుకొచ్చేవారు.అప్పట్లో ధర్మస్థల వివాదానికి సంబంధించి పోలీసులు దర్యాప్తు జరుపుతున్నప్పటికీ.. ప్రకాష్ రాజ్ ఊరుకునేవారు కాదు. దీనికి తోడు ఆ ఆలయంలో పనిచేసిన చిన్నయ్య మరింత వివాదాన్ని కలిగించే విషయాలను చెప్పడంతో ప్రకాష్ రాజ్ ఇంకా ఎక్కువ రెచ్చిపోయేవారు. దీంతో ధర్మస్థల ఆలయ ప్రాశస్త్యం చాలావరకు దెబ్బతిన్నది. దీనికి తోడు కొన్ని మీడియా సంస్థలు కావాలని నెగిటివ్ స్టోరీస్ పబ్లిష్ చేసేవి.ధర్మస్థల వివాదం మీద ఇప్పుడు ఒక క్లారిటీ రావడంతో.. ప్రకాష్ రాజ్ అసలు రంగు బయటపడుతోంది. దీనికి తోడు చిన్నయ్య కూడా కీలక విషయాలను చెప్పడంతో.. ఈ వ్యవహారం వెనుక పెద్ద వ్యవస్థీకృత ముఠా ఉన్నట్టు అందరికీ అర్థమవుతోంది. దీని వెనక భారీగానే డబ్బులు చేతులు మారాయని సమాచారం. ఈ వ్యవహారానికి సంబంధించి ఇటీవల ప్రకాష్ రాజ్ బెంగళూరులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఆ సమావేశంలో విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండానే మధ్యలో వదిలి వెళ్ళిపోయారు.ఇప్పుడిక ప్రకాష్ రాజ్ వ్యవహారం మరో మలుపుతీసుకుంది. ఆయన మీద నాన్ బెయిలబుల్ వారంటీ నమోదయింది. ఆయన ఏకంగా నాలుగు రాష్ట్రాలలో ఓటర్ గుర్తింపు కార్డులు కలిగి ఉన్నారంటూ కేసు దాఖలయింది. 48వ ఏసీజేఎం కోర్టు శనివారం ప్రకాష్ రాజ్ కు వారెంట్ జారీ చేసింది. ప్రకాష్ రాజ్ పలచోట్ల ఓట్ హక్కు కలిగి ఉన్నారంటూ దిలీప్ కుమార్ అనే లాయర్ 2019లో బెంగళూరు నగరంలో హలసూరు గేటు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత ఆయన బిబి ఎంపీ.. కేంద్ర ఎన్నికల కమిషన్ కు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ స్పందన లేకపోవడంతో కోర్టులో పిటిషన్ వేశారు. ప్రకాష్ రాజ్ తమిళనాడు.. ఆంధ్ర ప్రదేశ్.. కర్ణాటక.. తెలంగాణ రాష్ట్రాలలో ఓటు హక్కులు కలిగి ఉన్నారని దిలీప్ కుమార్ ఆరోపిస్తున్నారు. అయితే ఈ కేసు విచారణకు ప్రకాష్ రాజ్ హాజరు కాకపోవడంతో కోర్ట్ నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేయడం విశేషం.



# మూడు సముద్రాలపై భారత్ పట్టు

ముంబై, జూన్ 22, (న్యూస్ పల్స్)ఆకాశం, నీరు, నిప్పు.. ఈ మూడింటి ఆధారంగానే మనిషి మనుగడ సాగుతూ ఉంటుంది. వీటి మీద పట్టు చిక్కితే మనిషి జీవితం సులభం అవుతుంది. మనిషి అంటే కేవలం ఒకరు మాత్రమే కాదు.. ఈ యావత్ ప్రపంచం. నిప్పు మీద పట్టును కాస్త పక్కన పెడితే.. గగనం.. సంద్రం మీద పట్టు సాధించిన వారే గొప్పగా మనుగడ సాగిస్తా ఉంటారు.ప్పటివరకు ప్రపంచంలో అమెరికా.. రష్యా.. చైనా.. ఇంకా కొన్ని దేశాలు గగనతలం మీద పట్టు సాధించాయి.. సముద్రంలో కూడా సత్తా చాటాయి. అందువల్లే ఈ దేశాలకు ప్రపంచం మీద పెత్తనం ఎక్కువగా ఉంటుంది. అవి ఏం చెప్తే అదే చేయాలి. ఎలాంటి ఆదేశాలిస్తే వాటిని పాటించాలి.. అయితే ఇప్పుడు భారత్ వాటి సరసన చేరింది. మరి కొద్ది రోజుల్లో అయితే వాటిని మించిపోతుంది. దీనికి ప్రధాన కారణం దేశ ప్రధాని నరేంద్ర మోడీ తీసుకున్న నిర్ణయాలు.గడచిన కొంతకాలంగా మన దేశ నౌకాదళ వ్యవస్థలోకి 40 యుద్ధ.. సర్వే నౌకలు.. జలాంతర్గాములు వచ్చాయి. ఇంకా 45 తదుపరి దశలో ఉన్నాయి. అంతేకాదు అత్యాధునిక స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన స్టెల్త్ ఫ్రిగేట్ ఐఎన్ఎస్ దునగిరి, సర్వే నౌక, ఐఎన్ఎస్ సంషోదక్, జలాంతర్గామి వ్యతిరేక యుద్ధనౌక ఐఎన్ఎస్ అగ్రయ్ అనే మూడు నౌకలను ప్రధానమంత్రి ప్రారంభించారు. కోల్ కతా లోని శామ ప్రసాద్ ముఖర్జీ పోర్టు వద్ద జరిగిన కార్యక్రమంలో వీటిని జాతికి అంకితం చేశారు. ఈ మూడు నౌకలు అత్యంత ప్రత్యేకమైనవి. వీటివల్ల మన నౌకాదళం మరింత బలాన్ని పెంచుకుందిఇది అత్యంత పెద్దది. స్టెల్త్ ఫ్రిగేట్ విభాగంలో ఇది బాహుబలి లాగా ఉంటుంది. శత్రువుల రాడార్లు.. సెన్సార్లకు ఏమాత్రం చిక్కదు. పైగా ఇది అత్యాధునిక టెక్నాలజీతో పనిచేస్తూ ఉంటుంది. మన నౌకా దళంలో ఐఎన్ఎస్ నీలగిరికి ప్రత్యేకమైన పేరు ఉంది. ఈ ప్రాజెక్టు 17 ఏ లో భాగంగానే దీనిని నిర్మించారు. ఇందులో బ్రహ్మోస్ మిస్సైల్స్.. మిడిల్ రేంజ్ మిస్సైల్స్.. మల్టీ ఫంక్షన్ సర్వే లైన్స్.. ట్రాక్ గైడెన్స్ రాడార్.. సోనార్ సెన్సార్లు.. ఎలక్ట్రానిక్ వార్ ఫెయిర్ వ్యవస్థలు ఇందులో ఉంటాయి. ఇది ఏకంగా 149 మీటర్ల పొడవు..6670 టన్నుల బరువు ఉంటుంది. ఇది గంటకు 52 కిలోమీటర్ల వేగంతో దూసుకుపోతుందిఇది హై అండ్ టెక్నాలజీ తో రూపొందించిన హైడ్రోగ్రాఫిక్ సర్వే నౌక. ఇది పూర్తిగా సముద్ర గర్భాన్ని మ్యాపింగ్ చేస్తూ ఉంటుంది. మహా సముద్రాల లోతును

కొలుస్తూ ఉంటుంది. సముద్ర మార్గాలను నిత్యం అన్వేషిస్తూ ఉంటుంది. దీని పొడవు 110 మీటర్లు. బరువు 3400 టన్నులు ఉంటుంది. ఇది గంటకు 18 నాటికల్ మైళ్ల వేగంతో ప్రయాణం సాగిస్తూ ఉంటుంది. దీనిని దేశ అవసరాల కోసం ఉపయోగించుకోవచ్చు. నీటి అడుగున ఇది మ్యాపింగ్ చేస్తూ ఉంటుంది. దూర ప్రాంతాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరిస్తూ ఉంటుంది. అటానమస్ అండర్ వాటర్ వాహకాలు ఇందులో ప్రత్యేకంగా ఉన్నాయి. మనుషులు లేకుండానే దీని ద్వారా సముద్ర అంతర్భాగంలో పరిశోధనలు సులభంగా చేయవచ్చుదునగిరి, సంషోదక్ వంటి వాటితో పోల్చి చూస్తే అగ్రయ్ అత్యంత చిన్న నౌక.. ఇది పూర్తిగా జలాంతర్గామి విధ్వంసక యుద్ధ నౌక. ఇది శత్రు జలాంతర్గములను గుర్తిస్తూ ఉంటుంది. వాటిని నిత్యం ట్రాక్ చేస్తూ ఉంటుంది. తేలికపాటి టార్పెడో లేదా రాకెట్ల ద్వారా వాటిని ఇది ధ్వంసం చేస్తూ ఉంటుంది. ఇందులో షాలో వాటర్ సోనర్ వ్యవస్థ ఉంటుంది. ఇది అత్యంత కఠినమైన జలాల్లో కూడా పనిచేస్తూ ఉంటుంది.

# పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలి.

## ఆటో కార్మిక సంఘం సిఐటియుమండల గౌరవ అధ్యక్షులు గని శెట్టి డిమాండ్

పరవాడ.యుద్ధ ముగిసిన ప్రజలకు ఉపశమనం కల్పించని ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేస్తూ ముత్యమాంబ ఆటో కార్మిక సంఘంసిఐటియు ఆధ్వర్యంలో సోమవారం పరవాడ మండలం వాడ చీపురుపల్లిలో ఆందోళన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆటో కార్మిక సంఘం మండల గౌరవ అధ్యక్షులుగనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పెరుగుతున్న జీవన వ్యయం, ఇంధన ధరల భారం కారణంగా ఆటో కార్మికులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు (క్రూడ్ ఆయిల్) ధరలు గతంతో పోలిస్తే తగ్గుముఖం పట్టాయని, ప్రపంచవ్యాప్తంగా యుద్ధ ముగిసింది.అయితే తగ్గిన కూడ ఆయిల్ ప్రయోజనాన్ని ప్రజలకు అందించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలను తగ్గించడంలో ఆసక్తి చూపడం లేదని విమర్శించారు. ప్రజలపై పన్నుల భారం మోపడం ద్వారా ప్రభుత్వాలు భారీ ఆదాయం పొందుతున్నాయని, కానీ ప్రజల కష్టాలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పెట్రోల్, డీజిల్‌పై విధిస్తున్న పన్నులను తగ్గించి ధరలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం కేవలం వాహనదారులపైనే కాకుండా వ్యవసాయం, రవాణా, చిన్న వ్యాపారాలు, నిత్యావసర వస్తువుల ధరలపై కూడా పడుతోందన్నారు. ఆటో కార్మికుల పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారుతోందని పేర్కొన్నారు. రోజంతా కష్టపడి పనిచేసినా ఇంధన ఖర్చులు, వాహనాల నిర్వహణ వ్యయాలు, విడిభాగాల ధరలు పెరగడంతో కుటుంబాలను పోషించడం కష్టంగా మారిందన్నారు. బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థల నుంచి తీసుకున్న రుణాల వాయిదాలు చెల్లించలేక అనేక మంది ఆటో కార్మికులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారని తెలిపారు. వంటగ్యాస్ ధరల పెరుగుదలతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతోందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు కూడా నిరంతరం పెరుగుతుండటంతో సామాన్య ప్రజల జీవనం దుర్భరంగా మారిందని పేర్కొన్నారు. ప్రజల ఆదాయాలు పెరగకపోయినా జీవన వ్యయం మాత్రం రోజురోజుకూ పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

# ప్రతి పేదవాడికి ఇంటి కొరకు మరో ఇండ్ల పోరాటానికి వామపక్షాలు సంసిద్ధం



**ప్రతి నిరుపేదకు ఇల్లు,**
**ఇల్లు ఉన్నవారికి పట్టాలకు సర్వేలు, దరఖాస్తుల స్వీకరణ**
**10 వేల మందితో ఈ నెల 27న హనుమకొండలో భారీ ప్రదర్శన**
**జూలై 1న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, కలెక్టర్ కార్యాలయాల ముందు పెద్దఎత్తున ముట్టడి, నిరసన ప్రదర్శనలు**
**పేదలకు ఇళ్లను సాధించడమే లక్ష్యంగా సమరశీల పోరాటాలు**
**మహత్తర గుడిసెల పోరాటానికి' ఏ పేరు పెట్టాలనేది జూలై 2న జరుగు సమావేశం లో స్పష్టత**
**కూనంనేని సాంబశివరావు వెల్లడి..**

.హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతి నిరుపేదకు ఇళ్లు, ఇంటి స్థలం సాధించడమే లక్ష్యంగా వామపక్షపార్టీల ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యమం తరహాలో మరో పోరాటానికి శ్రీకారం చుట్టనున్నట్లు వామపక్ష పార్టీల నేతలు ప్రకటించారు. ఇందులో భాగంగా గుండ్ల సింగారం, గోపాల్ పూర్ తొలగించిన గుడిసెల స్థానాలలో పేదలకు ఇళ్ల కట్టించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ, సిపిఐ(ఎం) ఇతర వాపపక్ష పార్టీల ఆధ్వర్యంలో 10 వేల మందితో ఈ నెల 27న హనుమకొండలో భారీ ప్రదర్శనను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హనుమకొండ జిల్లాలోని గుండ్ల సింగారంలో పేదలు నిలువ నీడ కోసం వేసుకున్న గుడిసెలను అధికారులు బందిపోటు దొంగలల చోరబడి రాత్రి రాత్రికి వాటిని తొలగించారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అత్సుహాంతో అధికారులు ఎక్కడెక్కడ గుడిసెలు తొలగించారో అక్కడ తిరిగి గుడిసెవాసులకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలని లేకపోతే ప్రభుత్వాన్ని ప్రతిఘటిస్తామని వారు హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూంభవన్ ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ ఏ కూనంనేని సాంబశివరావు, సహాయ కార్యదర్శులు తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, ఈ.టి.నరసింహా, కార్యదర్శివర్గ సభ్యురాలు పశ్యపద్మ, సిపిఐ ఎంఎల్ సి నెల్లికంటి సత్యం,హైదరాబాద్ జిల్లా కార్యదర్శి బి.స్టాలిన్, వరంగల్ జిల్లా సెక్రటరీ బాషామియా, హనుమకొండ జిల్లా పార్టీ కార్యదర్శి కర్రె భిక్షపతి, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అబ్బాస్ , సిపిఐ ఎంఎల్ న్యూ డెమొక్రసీ నాయకులు కె.గోవర్ధన్, ఎంసిపిఐ నాయకులు సుధాకర్, ఎస్ నాయకులు భరత్ పాల్గొన్నారు. పేదలకు ఇళ్లను సాధించడమే లక్ష్యంగా సమరశీల పోరాటాలు : కూనంనేని సాంబశివరావుసమావేశంలో కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఇళ్లు లేని నిరు పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు దక్కేలా కమ్యూనిస్టు పార్టీలు సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని వామపక్ష పార్టీలు చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నాయని ప్రకటించారు. ఇందుకు సంబంధించిన దశల వారి ఉద్యమ కార్యాచరణను ఆయన వెల్లడించారు. ఇళ్ల స్థలాలు, ఇళ్ల కోసం జూలై 1న రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలు, కలెక్టర్ కార్యాలయాల ముందు పెద్దఎత్తున ముట్టడి, నిరసన ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన పేదల నుంచి దరఖాస్తులను సేకరించి జూలై 6న హైదరాబాద్ (ఇందిరాపార్క్) వేలాది మందితో ధర్నా నిర్వహించనున్నట్లు వారు చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి పేదల నుంచి సేకరించిన దరఖాస్తులను నేరుగా సమర్పిస్తామన్నారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి స్పందన మేరకు తమ ఉద్యమ కార్యాచరణ ఉంటుందని వారు చెప్పారు. ఈ 'మహత్తర గుడిసెల పోరాటానికి' ఏ పేరు పెట్టాలనేది జూలై 2న సమావేశమై నిర్ణయించనున్నట్లు కూనంనేని సాంబశివరావు వెల్లడించారు.

అధికారులు, పోలీసులు దొంగల మాదిరిగా అర్ధరాత్రి ఇళ్ళను కూల్చడం దుర్మార్గంహనుమకొండ జిల్లా గుండ్ల సింగారంలో గత 4 ఏళ్లుగా నిరుపేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తుంటే అధికారులు, పోలీసులు దొంగల మాదిరిగా అర్ధరాత్రి సమయంలో గ్రామంపై పడి ఎలాంటి విచక్షణ లేకుండా పేదల ఇళ్ళను కూల్చివేయడం దుర్మార్గమని సాంబశివరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలు, పిల్లలు అని కూడా చూడకుండా బలవంతంగా లాగిపడేసి అడ్డంవచ్చిన యువకులు, వృద్ధుల కాళ్ళు చేతులు మడిచి మరీ బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించి, సుమారు 300 నుండి 400 మందిని అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఒకప్పుడు అక్కడ ఉన్న 'కోమల కుంట' అనే చెరువును ప్రభుత్వం పూడ్చి, ఎస్ కాల్వను తవ్వేందుకు సిద్ధమైందని, ఇదే క్రమంలో ఉమ్మడి రాష్ట్రంలో 2009లోనే అప్పటి సిఎం రాజశేఖర్ రెడ్డి సర్వే నంబర్ 174, 175 కింద ఉన్న 56 ఎకరాల భూమిలో దాదాపు 1400 మంది పేదలకు పట్టాలు పంపిణీ చేశారన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కూడా మరో 40 మందికి ఇక్కడే పట్టాలు ఇవ్వగా ప్రస్తుతం బాధితులు కేవలం 8 ఎకరాల పరిధిలోనే గుడిసెలు వేసుకుని నివసిస్తున్నారని తెలిపారు. ఇక్కడ, కాల్వ ద్వారా నీరు వచ్చే పరిస్థితి లేకపోయినా అధికారులు అత్సుహాంతో గుడిసెలు కూల్చివేశారని, ఇప్పటికే ఈ సర్వే నంబర్లలోని వందలాది ఎకరాలు ఇతరుల ఆధీనంలో ఉన్నాయని, వాటిని ఎందుకు కూల్చివేయలేదని ఆయన ప్రశ్నించారు. ఈ కూల్చివేతలకు సంబంధించి స్థానిక ఎంఎల్ ఏ వివరణ కోరగా తనకు తెలియదని తప్పించుకున్నారన్నారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి, సలహాదారు నరేందర్ రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిపారు. ఇదే తరహాలో రెండు రోజుల కింద గోపాల్ ప్రాంతంలో సిపిఐ(ఎం) నాయకత్వంలో పేదలు వేసుకున్న గుడిసెలను కూడా ఎలాంటి దయాదాక్షిణ్యాలు లేకుండా కూల్చేసి, చుట్టూ ఫెన్సింగ్ వేశారన్నారు. గతంలో వెలుగుమట్లలోనూ ఇలాగే జరిగిందని, కూల్చేసిన చోటే మళ్ళీ ఇళ్ళు కట్టించి ఇస్తామని ప్రభుత్వం చెప్పడం వారి ద్వంద్వ విధానానికి నిదర్శనమని విమర్శించారు. గోపాల్ గుండ్ల సింగారం బాధితులకు వెలుగుమట్ల తరహాలోనే ప్రత్యామ్నాయ ఇళ్ళు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ మహానగరంతో పాటు రంగారెడ్డి, మేడ్చల్, వరంగల్, మహబూబాబాద్, భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో లక్షలాది మంది పేదలు 25, 30, 50 గజాల లోపు చిన్న చిన్న గుడిసెల్లో, మురికివాడల్లో నివసిస్తున్నారని వివరించారు. వీరంతా భూదాన్ భూములు, ప్రభుత్వ భూములు, మిగులు భూముల్లో దశాబ్దాలుగా ఉంటున్నారని వీరందరికి పట్టాలను ఇవ్వాలని సాంబశివరావు డిమాండ్ చేశారు. పేదలపై అక్రమ కేసులు అన్యాయం : అబ్బాస్ అబ్బాస్ మాట్లాడుతూ హన్మకొండ జిల్లా గుండ్ల సింగారం, గోపాల్ వెలుగుమట్ల, జగిత్యాల ప్రాంతాల్లో పేదలు వేసుకున్న దాదాపు 2 వేల గుడిసెలను ప్రభుత్వం అమానుషంగా కూల్చివేయడాన్ని సిపిఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు. పేదలపై అక్రమంగా కేసులు బనాయించి 40 నుండి 50 రోజుల పాటు జైళ్లలో పెట్టడం అత్యంత దారుణమన్నారు. 2007లో జరిగిన భూపోరాటంలో ముదిగొండ కాల్పుల్లో ఏడుగురు పేదలు ప్రాణాలు కోల్పోయారని, ఆతర్వాతే అప్పటి సిఎం వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి పేదలందరికీ ఇళ్ల స్థలాలు, ఇళ్లు కట్టించి ఇచ్చేందుకు 'ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని' ప్రారంభించారని గుర్తు చేశారు. నాడు ఆ పథకం కింద పట్టాలు పొందిన వారి ఇళ్లను కూడా నేడు ప్రభుత్వం కూల్చివేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తం చేశారు.పేద ప్రజలపై బుల్డోజర్లు ఎక్కించకండి: గోవర్ధన్ప్రభుత్వం పేద ప్రజలపై యుద్ధం చేయవద్దని, వారిపై బుల్డోజర్లు ఎక్కించి ఉసురు పోసుకోవద్దని కె.గోవర్ధన్ కోరారు. తెలంగాణ రాష్ట్రంలో 'గుడిసె రహిత' లేదా ఇల్లు లేని కుటుంబం అంటూ ఏదీ లేకుండా, ప్రతి కుటుంబానికి నిలువ నీడ ఉండేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దొంగల్లాగా, బందిపోట్లలాగా తెల్లవారుజామున వెళ్లి ఇళ్లను కూల్చడం సరైన పద్ధతి కాదన్నారు. కమ్యూనిస్టులుగా తాము ఎలాంటి గొంతెమ్మ కోరికలు కోరడంలేదన్నారు. కేవలం పేదలు తల దాచుకునేందుకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కబ్జాల చిట్టా ఇస్తాం.. చర్యలు తీసుకోండి: సుధాకర్నిలువ నీడ లేని పేదల పక్షాన నిలబడి పోరాడేది కమ్యూనిస్ట్ పార్టీలేనని, రాష్ట్రంలో ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు కబ్జాకు గురయ్యాయో, ఎక్కడెక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారులు భూములను అక్రమించుకున్నారో ఆ వివరాలన్నీ తాము ఇస్తామని, ధైర్యముంటే వారిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రికి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని సుధాకర్ సవాల్ చేశారు. ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని వెలుగులోకి తెచ్చింది కమ్యూనిస్టులేనని, బడా బాబుల నుంచి ప్రభుత్వ భూములను కాపాడుతున్నది కూడా తామేనని స్పష్టం చేశారు. అధికారుల అత్యుత్సాహంపై విచారణ జరపాలి : భరత్ కొంతమంది పోలీస్ అధికారులు, కలెక్టర్లు, ఉన్నతాధికారులు కొందరు పెద్దల అండతో పేదలపై అత్యుత్సాహం ప్రదర్శిస్తూ ఇళ్లను కూల్చివేస్తున్నారని భరత్ ఆగ్రహంవ్యక్తం చేశారు. అసలు ఈ కూల్చివేతలు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జరుగుతున్నాయా లేక అధికారులు ఇష్టారాజ్యంగా చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఒక వేళ ప్రభుత్వం నుండి ఎలాంటి ఉత్తర్వులు లేకుండా, అధికారులే సొంత నిర్ణయాలతో అత్యుత్సాహం ప్రదర్శిస్తూ పేదలపై దాడులకు తెగబడుతున్న అధికారులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

# అమర్‌నాథ్ యాత్రకు 'ఆపరేషన్ శివ'

జూలై 3వ తేదీ నుంచి మొదలయ్యే అమర్‌నాథ్ యాత్రకు మునుపెన్నడూ లేని విధంగా భారీ భద్రతా ఏర్పాట్లను చేపట్టారు. ఆపరేషన్ శివ పేరుతో సైన్యం ఈసారి ప్రత్యేక వ్యూహాన్ని అమలు చేస్తోంది. యాత్రకు సరికొత్త టెక్నాలజీతో యాంటీ?డ్రోన్ వ్యవస్థతో భద్రతను కల్పించనుంది.సున్నితమైన 55 ప్రాంతాల్లో అత్యాధునిక యాంటీ?డ్రోన్ గన్‌లు, నిఘా పరికరాలను మోహరించారు.దేశంలోనే మొదటిసారిగా ఇంత పెద్ద సంఖ్యలో ఇలాంటి వ్యవస్థను ఉపయోగించడం ఇదే మొదటిసారి. ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ పరికరాలు, ప్రత్యేక నిఘా వ్యవస్థలు శత్రు డ్రోన్లను గుర్తించి క్షణాల్లో నిరీ?వర్యం చేయగలవు. సుమారు 400 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న జమ్మూ?శ్రీనగర్ జాతీయ రహదారి, బాల్తాల్, పహల్గామ్ మార్గాలను ఈ వ్యవస్థ పర్యవేక్షిస్తుంది. ఆర్మీ నార్తర్న్ కమాండ్ లెఫ్టినెంట్ జనరల్ ప్రతీక్ శర్మ స్వయంగా బాల్తాల్, సోన్‌మార్గ్ ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు.

## పవన్ కళ్యాణ్ మాటలకు నా పీఏ కూడా స్పందించడు : జడ శ్రవణ్ కుమార్



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై జై భీమ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది జడ శ్రవణ్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. విజయవాడలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. పవన్ కళ్యాణ్ హావభావాలు, ఆయన మాట్లాడుతున్న విధానంపై సోషల్ మీడియాలో విపరీతంగా మీమ్స్, ట్రోల్స్ వస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఈ శతాబ్దపు మోస్ట్ కామిక్ పర్సన్ పవన్ కళ్యాణ్ అని, ఆయన సినిమాల్లో కంటే నిజ జీవితంలోనే అత్యంత అద్భుతంగా నటిస్తున్నారని విమర్శించారు. పదిమందిలో మాట్లాడుతున్నామనే కనీస బాధ్యత లేకుండా మాట్లాడుతున్నారని, ఆయన ఉప ముఖ్యమంత్రి కాకుండా ఉంటే ప్రెస్ మీట్లో ఆయన మాటలకు నా పీఏ కూడా స్పందించడని అన్నారు. అసలు ఆయన వెంట ఒక సామాజిక వర్గం కళ్లు మూసుకుని ఎలా నడుస్తుందో నాకు ఇప్పటికీ అర్థం కావడం లేదని అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గత రాజకీయాలను ప్రస్తావిస్తూ.. 2019 వరకు రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వమే అధికారంలో ఉందని, మరి దానిపై పవన్ కళ్యాణ్ ఎందుకు నోరు మెదపలేదని శ్రవణ్ కుమార్ నిలదీశారు. ముఖ్యంగా సంచలనం రేపిన 'సుగాలి ప్రీతి' కేసును పవన్ డీల్ చేస్తున్న తీరుపై ఆయన లీగల్ పాయింట్స్ లేవనెత్తారు. సుగాలి ప్రీతి అసలు ఏ సంవత్సరంలో చనిపోయిందో కూడా కనీస అవగాహన లేకుండా పవన్ మాట్లాడుతున్నారని విమర్శించారు. గతంలో ఈ కేసు విషయంలో 'భౌభౌ' అని అరిచిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు అధికారంలోకి వచ్చాక మాట మారుస్తున్నారని జడ శ్రవణ్ మండిపడ్డారు. సుగాలి ప్రీతి కేసులో పోలీసులు సమర్పించిన ఛార్జ్‌షీట్‌లో అన్ని రకాల పక్కా ఆధారాలు ఉన్నాయని, కానీ పవన్ కళ్యాణ్ మాత్రం ఆధారాలు లేవని అనడం వెనుక అసలు ఉద్దేశం ఏంటని శ్రవణ్ కుమార్ ప్రశ్నించారు. కేసుకు సంబంధించిన సాక్ష్యాధారాలన్నీ కోర్టులో అత్యంత భద్రంగా ఉన్నాయని అన్నారు. ఆధారాలు లేవంటూ నిందితులను కేసు నుంచి తప్పించాలని పవన్ చూస్తున్నారా..? అంటూ సూటిగా ప్రశ్నించారు. పవన్ కళ్యాణ్ అజ్ఞానాన్ని చూసి జనసేన నేతలు, కార్యకర్తలు తరించాలంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

## చికాగోలో కాల్పుల ఘటనలు.. ఏడుగురు మృతి, 38 మందికి గాయాలు



చికాగో: అమెరికాలోని చికాగోలో ఇటీవల కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి. శుక్రవారం నుంచి జరిగిన ఆ ఘటనల్లో సుమారు ఏడు మంది మృతిచెందారు. మరో 38 మంది గాయపడ్డారు. అమెరికాలో అతిపెద్ద మూడవ నగరమైన చికాగోలు జరుగుతున్న హింసాత్మక ఘటన పట్ల అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. ఆ సిటీలో మిలిటరీని ప్రవేశపెట్టేందుకు ఆయన ఆలోచిస్తున్నట్లు తెలిసింది. సిటీలో సుమారు 20కు పైగా ప్రదేశాల్లో కాల్పుల ఘటనలు జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ఓ ప్రదేశంలో సామూహిక కాల్పుల ఘటన జరిగింది. అక్కడ 12 మంది గాయపడ్డారు. ఓ ఎస్‌యూవీ నుంచి వ్యక్తి గన్‌తో ఫైరింగ్ చేశాడు. చికాగోలో పరిస్థితి అదుపు తప్పడంతో అక్కడ ఆందోళనకరంగా మారింది. చికాగోను సురక్షిత నగరంగా మార్చగలనని తన ట్రుత్ సోషల్ పోస్టులో ట్రంప్ పేర్కొన్నారు.

## బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ రాజీనామా

లండన్ : బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌రాజీనామా చేశారు. లేబర్ పార్టీ నేతగా కూడా రిజైన్ చేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. అయితే తమ పార్టీకి కొత్త నేతను ఎంపిక చేసే వరకు తాత్కాలికగా ప్రధానిగా స్టార్మర్ కొనసాగనున్నారు. మరికొన్ని వారాల్లో కొత్త నేతను ఎన్నుకోనున్నారు. 2024లో ఆయన నేతృత్వంలో లేబర్ పార్టీ ఎన్నికల్లో విజయం సాధించింది. కానీ రెండేళ్లలోనే ఆయనతో పాటు పార్టీ పాపులారిటీ కూడా తగ్గిపోయింది. గత వారం జరిగిన ఎన్నికల్లో ఆండీ బర్న్‌హమ్ .. ప్రత్యేక ఎన్నికల్లో గెలిచారు. గ్రేటర్ మాంచెస్టర్ మాజీ మేయర్ అయిన ఆయన. లేబర్ పార్టీ నాయకత్వ పాత్రకు పోటీపడనున్నారు.రెండేళ్ల క్రితం డౌనింగ్ స్ట్రీట్‌లోకి ఎంట్రీ ఇవ్వడం జీవితంలో గర్వించదగ్గ సందర్భం అని తెలిపారు. ప్రజల జీవితాలను మెరుగుపరుచాలన్న ఉద్దేశంతో రాజకీయాల్లోకి ప్రవేశించినట్లు ఆయన చెప్పారు. దేశ ఆర్థిక, రక్షణ వ్యవస్థను పునరుత్తేజం చేసినట్లు స్టార్మర్ తెలిపారు. రాజకీయంగా, ఆర్థికంగా, నైతికంగా దివాళా తీసిన లేబర్ పార్టీకి జీవం పోశానన్నారు. పార్టీ పని అయిపోయిందన్న వారికి.. ఆ వ్యాఖ్యలు తప్పు అని నిరూపించారన్నారు.రాజీనామాపై ఇవాళ ఉదయం బ్రిటన్ రాజుతో చర్చించినట్లు ఆయన చెప్పారు. లేబర్ పార్టీ నాయకత్వం కోసం నామినేషన్లు స్వీకరించాలని చెప్పానన్నారు. అయితే సెప్టెంబర్‌లో కొత్త నేత వచ్చే వరకు స్టార్మర్ తాత్కాలిక ప్రధానిగా చేయనున్నారు.



## కొత్తగా 'కొండల్ రెడ్డి బ్యాంక్' అని పెట్టడో ఏమో.. ఎస్‌బీఐ విషయంలో రేవంత్ రెడ్డి తీరుపై హరీశ్ రావు

హైదరాబాద్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు అప్పటి ప్రభుత్వం ఎకరం భూమిచ్చింది. రేవంత్ రెడ్డి బ్యాంక్‌కు ఇచ్చిన భూమిని అమ్మేసిండని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. అచ్చంపేట బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. ఎస్‌బీఐకి ఇచ్చిన భూమిని వేలానికి ఇచ్చిండు.. భూమిని అమ్మేసిండు. అమ్మేస్తే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోర్టుకు వెళ్లింది. మాకు ఎకరం భూమి ఇచ్చిర్రు. ఇది కూడా ఉచితంగా ఏం ఇయ్యలేదు. మేము దాదాపు రూ.20 కోట్లు పెట్టి ఈ భూమి కొనుక్కున్నమని.. ఈ భూమి మా పొజిషన్‌లో ఉన్నది. పైసల్ పెట్టి కొన్న మా భూమి రేవంత్ రెడ్డి ఎట్లా అమ్ముకున్నడు.. అని హైకోర్టుకు పోయారన్నారు.కోర్టు వాళ్లు పైసలు పెట్టి కొన్నది నిజమే కదా ఈ అమ్మకం తప్పు అని స్టే ఇచ్చింది.




ఖతం రేవంత్ రెడ్డి ఎస్‌బీఐ మీద పగపట్టిండు. ఎస్‌బీఐని నిషేధిస్తాం. ఎస్‌బీఐలో ఉండే ఫిక్స్‌డ్ డిపాజిట్లు బయటకు తీసేస్తాం. ఎస్‌బీఐకి రాష్ట్ర ప్రభుత్వానికి ఉండే ఖాతాలన్ని తీసేస్తా.. అని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను కూడా బ్లాక్ మెయిల్ చేస్తుండు.. రేవంత్ రెడ్డి తీరు ఎవరన్నా ప్రశ్నిస్తే పగబడ్తమన్నట్టు ఉంది.ఇవాళ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియానే నిషేధిస్తా అంటున్నడు.. రేపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వరల్డ్ బ్యాంక్ కూడా నీ మాట వినలేదనుకో దాన్ని కూడా నిషేధిస్తా అంటాడు అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఒక ఒక బ్యాంక్ అయితే కావాలి కదా.. ఎవరు నీకు వ్యతిరేకంగా మాట్లాడితే ఆ బ్యాంక్‌నే నిషేధిస్తా అంటే మరి ఏం చేస్తడు.. నాకో డౌటు..కొత్తగా కొండల్ రెడ్డి బ్యాంక్ అని పెడ్తడో ఏమో.. పెట్టినా పెడ్తడు మస్త్ జమ అయినయ్ పైసలు. రేపు ఎనుముల కొండల్ రెడ్డి బ్యాంక్ అని పెట్టినా పెడ్తరన్నారు హరీశ్ రావు.

## తమిళనాడులో భారీ విధ్వంసం.. ఎగిరిపోయిన ఇళ్ల పైకప్పులు, సామగ్రి




చెన్నై: తమిళనాడులోని తూత్తుకుడి జిల్లాలో భారీ విధ్వంసం జరిగింది. టోర్నడో లాంటి వాతావరణం ఏర్పడి వాగైకుళం, ముడివైతానెండల్ గ్రామాలను అతలాకుతలం చేసింది. చూసేందుకు అచ్చం టోర్నడోలాగా ఉన్న గాలి ప్రవాహం విధ్వంసం సృష్టించింది. తూత్తుకుడి విమానాశ్రయం సమీపంలోని ఇళ్లు, ఓ టోల్ ప్లాజా, ప్రైవేట్ థీమ్ పార్కుపై విరుచుకుపడింది. అయితే, ఇది టోర్నడో కాదని క్యుములోనింబస్ మేఘ వ్యవస్థకు సంబంధించి శక్తివంతమైన ఉరుములతో కూడిన గాలి ప్రవాహమని వాతావరణ శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు.క్యుములోనింబస్ కారణంగా బలమైన స్థానిక గాలులు, దుమ్ము రేగడంతో పాటు అప్‌డ్రాఫ్ట్‌లనే తీవ్రమైన పైకి కదిలే గాలి ప్రవాహాలు ఏర్పడ్డాయని పేర్కొన్నారు. అయితే, దీని కారణంగా దాదాపు 200 ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఇళ్ల పైకప్పులు, సామగ్రి, ఇతర వస్తువులు గాలిలోకి ఎగిరిపోయాయి. భయంకరమైన గాలుల వల్ల భారీగా చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళలకు గురయ్యారు. ఏం జరుగుతుందో అర్థంకాక అయోమయానికి లోనైయ్యారు. ఈ ఘటనలో ఇద్దరికి స్వల్పగాయాలు కాగా.. ప్రాణనష్టం తప్పింది.మరోవైపు వాగైకుళం టోల్ ప్లాజాలోని కంప్యూటర్లు, ఇతర పరికరాలు దెబ్బతినడంతో టోల్ వసూళ్లను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. టోల్ చెల్లించకపోయినా వాహనాలను వెళ్లనిచ్చారు. అలాగే స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ థీమ్ పార్క్ పూర్తిగా దెబ్బతిన్నది. ఈ విధ్వంసం కారణంగా సుమారు రూ.5కోట్ల నుంచి రూ.6కోట్ల మేర నష్టం వాటిల్లి ఉండొచ్చని స్థానిక అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా, దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి.

## నీట్ రీటెస్ట్‌లో అవకతవకలు..

### బీహార్‌లో 24 మంది అరెస్ట్

పాట్నా: నీట్ రీటెస్ట్‌లో అవకతవకలు బయటపడ్డాయి. అభ్యర్థులకు బదులు కొందరు మెడికల్, నర్సింగ్ విద్యార్థులు నీట్ పరీక్ష రాశారు. పరీక్షా కేంద్రాల్లోని బయోమెట్రిక్ ఉద్యోగులు వీరికి సహకరించినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో ఈ ముఠాకు చెందిన 24 మందిని అరెస్ట్ చేశారు. బీహార్‌లోని పాట్నా మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో మూడవ సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతున్న మయాంక్ కశ్యప్ అనే మెడికల్ విద్యార్థి, నీట్ అభ్యర్థికి బదులు పరీక్ష రాసేందుకు హసన్‌పూర్ హైస్కూల్ పరీక్షా కేంద్రానికి చేరుకున్నాడు. బయోమెట్రిక్ సంస్థ ఉద్యోగిగా నమ్మించి లోనికి ప్రవేశించాడు.కాగా, పరీక్షా నిర్వాహకులు అనుమానించడంతో తొలుత మయాంక్ కశ్యప్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి సమాచారం ఆధారంగా లఖీసరాయ్‌లోని కేఆర్‌కే హయ్యర్ సెకండరీ స్కూల్, కేంద్రీయ విద్యాలయాలలో ఏర్పాటు చేసిన ఎగ్జామ్ సెంటర్స్‌పై పోలీసులు రైడ్ చేశారు. దీంతో అసలు అభ్యర్థులకు బదులుగా పరీక్షలు రాస్తున్న ప్రాక్సీ నెట్‌వర్క్ గుట్టురట్టయ్యింది. వైద్య, నర్సింగ్ విద్యార్థుల ప్రమేయం ఉన్నట్లు దర్యాప్తులో తేలింది.దీంతో అసలు అభ్యర్థులకు బదులు పరీక్షలు రాసిన బనారస్ హిందూ విశ్వవిద్యాలయం నర్సింగ్ విద్యార్థిని పూనమ్ కుమారి, ఎయిమ్స్ రాయ్‌బరేలీ విద్యార్థి సౌరభ్ ఝా, ఢిల్లీలోని షాదారా మెడికల్ కాలేజీలో ఇంటర్న్‌గా పనిచేస్తున్న అమన్ అగర్వాల్, నలంద మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్ నర్సింగ్ విద్యార్థి సంజీత్, అతడి సోదరుడు, ఏడుగురు అసలు అభ్యర్థులు, బయోమెట్రిక్ సంస్థకు చెందిన 14 మంది ఉద్యోగులతో సహా మొత్తం 24 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు.కాగా, అసలు అభ్యర్థుల స్థానంలో శిక్షణ పొందిన సాల్వర్‌లతో పరీక్ష రాయించేందుకు ఈ చీటింగ్ ముఠా ప్లాన్ వేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. గయలోని ఏఎన్ఎం మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌కు చెందిన మెడికల్ విద్యార్థి అర్పిత్ రాజ్ ఈ నెట్‌వర్క్ సూత్రధారులలో ఒకరని అనుమానిస్తున్నారు. గతంలో 2024 నీట్ పేపర్ లీక్ కేసులో కూడా సీబీఐ అతడ్ని విచారించినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఈ నెట్‌వర్క్ పరిధితో పాటు ఇందులో ప్రమేయం ఉన్న మిగతా నిందితులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు చెప్పారు.అయితే నీట్ రీటెస్ట్‌లో అన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఈ అవకతవకలు ఎలా జరిగాయి? నీట్ పరీక్షల సమయంలో వైద్య విద్యా సంస్థలు నియంత్రణలు విధించినప్పటికీ వైద్య విద్యార్థులు ఎలా పాల్గొన్నారు? అన్న సందేహాలు కలుగుతున్నాయి.



## వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడు అండ్ టీంకు సినిమా చూపెట్టే బాధ్యత నాది : కేటీఆర్



వర్ధన్నపేట నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌తోపాటు నియోజకవర్గానికి చెందిన నేతలు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వచ్చే ఐదేళ్లు ఏదీ మర్చిపోము. మనల్ని ఇబ్బంది పెట్టినోడిని మర్చిపోం.. మనమీద కేసులు పెట్టినోడిని మరిచిపోం. మనతో నిలబడినోళ్లను కూడా మరిచిపోమన్నారు.తప్పకుండా చెప్తున్నా.. నేను కేసీఆర్ సారంతా మంచోన్నైతే కాదు. వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడుకు ఆయన బృందానికి సినిమా చూపెట్టే బాధ్యత నాది.. పక్కా విడిచిపెట్ట. రిటైరైనా పారిపోయినా సప్తసముద్రాల అవతల దాక్కున్నా.. ఎవడెవడైతే మా కార్యకర్తలను సతాయించిండో ఒక్కొక్కడిని వెతికి తెచ్చి మీ ముందట నిలబెట్టే బాధ్యత నాది.. వదిలిపెట్టే సమస్యే లేదన్నారు. ఇది నేనేం ఊరికే చెప్పడం లేదు.. గుర్తు పెట్టుకోండి. కానీ రమేశన్న (ఆరూరి రమేశ్) వీడు మంచోడేనే అన్నా అని మళ్లా వారిని తీసుకొని రావొద్దని కేటీఆర్ సూచించారు.

## భూ వివాదం.. బాలీవుడ్ నటుడు పంకజ్ త్రిపాఠి సోదరుడిపై దాడి..



పాట్నా: బిహార్‌లో బాలీవుడ్ ప్రముఖ నటుడు పంకజ్ త్రిపాఠి సోదరుడు విజయేంద్రనాథ్ తివారీపై దాడి జరిగింది. ఓ భూ వివాదంలో ఆదివారం రాత్రి కొంతమంది వ్యక్తులు కర్రలతో ఆయనపై దాడికి పాల్పడ్డారు. దీంతో నటుడి సోదరుడికి తీవ్రగాయాలు అయ్యాయి. ఈ ఘటన పంకజ్ త్రిపాఠి స్వగ్రామమైన గోపాల్‌గంజ్ జిల్లా బెల్సంద్‌లో చోటుచేసుకుంది. తీవ్రంగా గాయపడిన విజయేంద్రనాథ్‌ని బాధిత కుటుంబ సభ్యులు దాడి జరిగిన రోజు రాత్రే గోపాల్‌గంజ్ మోడల్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం పాట్నాకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ కేసుకు సంబంధించి ఒకరిని గోపాల్‌గంజ్ పోలీసులు అరెస్టు చేయగా.. ఘటనపై స్పందించేందుకు నటుడి కుటుంబం నిరాకరించింది. కాగా, అరెస్టు చేసిన నిందితుడిని జ్యుడీషియల్ కస్టడీకి తరలిస్తున్నట్లు ఎస్పీ వినయ్ తివారీ తెలిపారు. బాధిత కుటుంబం ఇంకా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయలేదని ఆయన పేర్కొన్నారు. అధికారిక ఫిర్యాదు అందిన తర్వాత పోలీసులు తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటారని గోపాల్‌గంజ్ ఎస్పీ వినయ్ తివారీ తెలిపారు.

## గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయండి: కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్,గ్రామాల్లో విరివిగా పశు వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా పశు వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్ సమీపంలో ఉన్న జిల్లా ప్రధాన పశువుల ఆసుపత్రిని కలెక్టర్ సందర్శించారు.రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రి ద్వారా పశువులకు అందిస్తున్న సేవలు, వాక్సినేషన్, మందుల వివరాలు తెలుసుకున్నారు. గదులు కలియ తిరుగుతూ ల్యాబరేటరీ, శస్త్ర చికిత్స గదులు,ఎక్స్ రే గది, మందుల గది పరిశీలించారు. సిబ్బందిని అడిగి పలు వివరాలు తెలుసుకున్నారు. శిథిల భవనం తొలగించండి:ఆస్పత్రి ముందు శిథిలావస్థకు చేరిన పాత భవనాన్ని పరిశీలించి..తొలగించాలని ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. పాత భవనం స్థానంలో ఫౌంటెయిన్, పార్కింగ్ ప్లేస్, జంతువుల శవపరీక్ష ఏర్పాటు చేయాలన్నారు.పక్కనున్న మరో భవనాన్ని జంతువుల ఆపరేషన్ కోసం వినియోగించాలని సూచించారు.ఇక్కడున్న అన్ని పరికరాలను సద్వినియోగం చేసుకుంటూ పశువులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి లింగారెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్లు నరేష్ కుమార్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.


## చేనేత కార్మికుల సమస్యలపై ముఖ్యమంత్రి వినతిపత్రం అందజేసిన మంత్రి కొండా సురేఖ

వరంగల్ ,వరంగల్ జిల్లా చేనేత సహకార సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 50కు పైగా చేనేత సహకార సంఘాలకు చెందిన సుమారు 5,000 మంది చేనేత కార్మికులు గత మూడు దశాబ్దాలుగా రాష్ట్ర వస్త్రోత్పత్తి రంగానికి వెన్నెముకగా నిలుస్తున్నారు. బీసీ,ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు,గురుకుల విద్యాసంస్థలు మరియు ఇతర ప్రభుత్వ విద్యాసంస్థలకు అవసరమైన బెడ్‌షీట్లు,కార్పెట్లు, యూనిఫాంలు తదితర వస్త్ర ఉత్పత్తులను నిరంతరంగా సరఫరా చేస్తూ వేలాది కుటుంబాలకు జీవనోపాధి కల్పిస్తున్నారు.ఈ నేపథ్యంలో చేనేత కార్మికుల ఉపాధి, సంక్షేమం మరియు చేనేత రంగ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని, చేనేత ఉత్పత్తులను కేంద్రీకృత టెండర్ విధానం నుంచి మినహాయించాలని,వారి న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రి కొండా సురేఖ వినతిపత్రం అందజేశారు.చేనేత ఉత్పత్తులను కేంద్రీకృత టెండర్ విధానం నుంచి మినహాయించడం ద్వారా వేలాది మంది చేనేత కార్మికుల ఉపాధిని పరిరక్షించవచ్చని మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఎమ్మెల్సీ కాలేజీల్లో అన్నీ లోపాలే

గుంటూరు, జూన్ 22, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి తనయుడు చైర్మన్‌గా వ్యవహరిస్తున్న కృష్ణ చైతన్య విద్యాసంస్థల పై విద్యాశాఖ ఉన్నతాధికారులు ఒక్కసారిగా విరుచుకుపడ్డారు. ఈ విద్యాసంస్థలకు చెందిన ఆరు జూనియర్ కళాశాలలపై గుంటూరు, నెల్లూరు జిల్లాల నుంచి ప్రత్యేకంగా వచ్చిన విద్యాశాఖ, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ అధికారులు సంయుక్తంగా మెరుపు దాడులు నిర్వహించారు. మధ్యాహ్నం ప్రారంభమైన ఈ తనిఖీలు అర్ధరాత్రి దాటే వరకు సాగాయి.అధికారుల సుదీర్ఘ తనిఖీల్లో సదరు విద్యాసంస్థల యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలను ఏ ఒక్కటి కూడా సక్రమంగా పాటించడం లేదనేగ్ర్భ్రాంతికరమైన విషయాలు వెలుగుచూశాయి. అగ్నిమాపక శకటం వెళ్లేందుకు కనీస స్థలం లేకపోవడం, ఫైర్ సేఫ్టీ అనుమతులు గడువు ముగిసినా నూతనీకరించకపోవడం, సామర్థ్యానికి మించి ఒకే గదిలో విద్యార్థులను గొర్రెల మందలా ఉంచడం వంటి అనేక లోపాలను అధికారులు గుర్తించారు. అంతేకాకుండా, ల్యాబ్‌లలో కెమికల్స్ భద్రత సరిగా లేకపోవడం, విద్యార్థులకు కనీస తాగునీరు, పరిశుభ్రమైన శానిటేషన్ వసతులు కూడా కల్పించకపోవడాన్ని కూడా గుర్తించారు.రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా ఉండేందుకు విద్యాశాఖ ఉన్నతాధికారులు అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించారు. పొరుగు జిల్లా అయిన గుంటూరుతో పాటు నెల్లూరు జిల్లాకు చెందిన ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించారు. కాలేజీ రికార్డులు, అటెండెన్స్ రిజిస్టర్లు, బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్, హాస్టల్ అనుమతులకు సంబంధించిన ప్రతీ పత్రాన్ని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. అర్ధరాత్రి దాటే వరకు అటెండెన్స్ సాఫ్ట్‌వేర్ డేటాను, అడ్మిషన్ల రికార్డులను క్రాస్ వెరిఫై చేసిన అధికారులు.. అనుమతులు లేని అదనపు సెక్షన్లను నడుపుతున్నట్లు ప్రాథమికంగా గుర్తించి ఆయా ఫైళ్లను సీజ్ చేశారు.ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి కుమారుడు చైర్మన్‌గా ఉన్న విద్యాసంస్థలు కావడంతో, ఐదేళ్ల హయాంలో ఇక్కడి లోపాలపై స్థానిక అధికారులు కన్నెత్తి కూడా చూడలేదనే ఆరోపణలు ఉన్నాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యావ్యవస్థ ప్రక్షాళనలో భాగంగా రూల్స్ ఉల్లంఘించే కార్పొరేట్ కాలేజీలపై ఉక్కుపాదం మోపుతోంది. ఈ తనిఖీలపై గుంటూరు, నెల్లూరు అధికారులు తుది నివేదికను ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్‌కు సమర్పించనున్నారు. నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కిన కృష్ణ చైతన్య విద్యాసంస్థల గుర్తింపు రద్దు చేయడంతో పాటు భారీగా జరిమానా విధించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఉన్నతాధికార వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

# కదిరిలో సవాళ్లు.. ప్రతి సవాళ్లు



అనంతపురం, జూన్ 22, (న్యూస్ పల్స్)సత్యసాయి జిల్లాలో టీడీపీ వర్సెస్ వైసీపీ రాజకీయాలు జోరుగా సాగుతున్నాయి. ముఖ్యంగా కదిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ , వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరుకుంది. స్థానిక టీడీపీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి మధ్య నడుస్తున్న వ్యక్తిగత ఆరోపణలు, సవాళ్లు కదిరి రాజకీయాలను వేడెక్కిస్తున్నాయి. ఇరు పార్టీల నేతలు అవినీతి, కబ్జాలు, కుటుంబ సభ్యులపై ఆరోపణలతో బహిరంగ చర్చలకు సై అంటూ సవాళ్లు విసురుకుంటున్నారు. కదిరి టీడీపీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ప్రవీణ్ రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్థాయి వేరు.. ఆయన తండ్రి వైఎస్సార్ కూడా ముఖ్యమంత్రిగా పనిచేశారు. అలాంటి నాయకుడి భార్యను అకారణంగా రాజకీయాల్లోకి లాగి అవమానిస్తావా అంటూ ప్రవీణ్ రెడ్డి ఎమ్మెల్యేను నిలదీశారు. నీతి, నిజాయితీల గురించి మాట్లాడే ముందు ఎమ్మెల్యే తన గతం, చరిత్ర గురించి ఆలోచించుకోవాలని, మహిళల గురించి మాట్లాడే ముందు కొంత సంస్కారం నేర్చుకోవాలని హితవు పలికారుఎమ్మెల్యే ప్రసాద్ అవినీతి గురించి మాట్లాడితే కదిరి ప్రజలు నవ్వుకుంటున్నారని ప్రవీణ్ రెడ్డి ఎద్దేవా చేశారు. కదిరి నియోజకవర్గంలో బ్రాందీ షాపులు, పల్లెల్లో బెల్ట్ షాపులు పెట్టించి.. మద్యం బాటిల్‌పై రూ. 20 నుండి రూ. 40 వరకు అధికంగా అమ్మించి కమిషన్లు దండుకుంటోంది ఎమ్మెల్యే కాదా? అని ప్రశ్నించారు. ఆ అక్రమంగా వసూలు చేసిన డబ్బులు మీ ఇంట్లో వాళ్లు ఇస్తున్నారా అని మేము అడిగితే అది తప్పు అవుతుందా? అని ఘాటుగా నిలదీశారు. అంతేకాకుండా, కదిరిలో ఎమ్మెల్యే తన ఇంటి ముందున్న దేవుడి మాన్యం స్థలాన్ని 15 ఏళ్లుగా కబ్జా చేసి సొంత పార్కింగ్‌గా వాడుకోవడం నిజం కాదా అంటూ దేవాదాయ శాఖ భూముల కబ్జాపై సంచలన ఆరోపణలు చేశారు.గడిచిన రెండున్నరేళ్ల కాలంలో కదిరి నియోజకవర్గానికి ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి శూన్యమని ప్రవీణ్ రెడ్డి విమర్శించారు. ముఖ్యంగా కదిరిలో మైనార్టీ ముస్లింలపై ఎమ్మెల్యే కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

# మాజీ సిఐ నాగరాజు కి మద్దతుగా కృష్ణలంకలో కొవ్వొత్తులు ర్యాలీ

### ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్న యువత, స్థానిక మహిళలు

విజయవాడ,కృష్ణలంక మాజీ సిఐ నాగరాజు కి మద్దతుగా కృష్ణలంకలో కొవ్వొత్తులు ర్యాలీ నిర్వహించారు. స్థానికులు మాట్లాడుతూ నాగరాజు కృష్ణలంక పిఎస్ లో చార్జి తీసుకున్నప్పటి నుండి రౌడీయిజం మీద ఉక్కు పాదం మోపారు. ముఖ్యంగా కృష్ణలంక ఏరియాలో గంజాయి బ్యాచ్ ఆగడాలను పూర్తిగా అరికట్టారని అన్నారు.ఆడపిల్లలపై ఎవరైనా తప్పుగా ప్రవర్తిస్తే వాడి కి తమదైన శైలిలో ట్రీట్మెంట్ ఇచ్చి నేరలను అరికట్టారు. గత ప్రభుత్వ హయాంలో రాత్రిపూట పది తర్వాత ఆడవాళ్లు బయటికి వెళ్లాలంటేనే భయపడే వారు. ఇప్పుడు నాగరాజును ఇక్కడి నుండి తప్పిస్తే మళ్లీ వారి ఆగడాలు ఎక్కువ అవుతాయి. గతంలో రౌడీ షీటర్లను ఎన్కౌంటర్ చేసినప్పుడు దానిని సమర్థించిన పెద్దలు దీన్ని ఎందుకు తప్పుగా అర్థం చేసుకుంటున్నారని ప్రశ్నించారు.

# సాయికృష్ణ కేసు..మార్కాపురం టు విజయవాడ మధ్యలో ఏం జరిగింది?


ఒంగోలు, జూన్ 22, విజయవాడ నగరంలో సాయికృష్ణ అదృశ్యం కేసు ఇప్పుడు పెను సంచలనంగా మారింది. అసలు సాయికృష్ణ ఏమయ్యాడు, పోలీసులు కస్టడీలో ఉండగానే ప్రాణాలు కోల్పోయడా? లేదా ఎవరైనా మాయం చేశారా? ఈ ప్రశ్నల చుట్టూ తిరుగుతున్న మిస్టరీని ఛేదించేందుకు ఏసీపీ దైవప్రసాద్ నేతృత్వంలోని స్పెషల్ టీమ్ రంగంలోకి దిగింది. శుక్రవారం ఉదయమే కృష్ణ లంకలోని సాయికృష్ణ నివాసానికి చేరుకున్న అధికారులు, కుటుంబసభ్యుల నుంచి సేకరించిన వివరాలు ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమవుతున్నాయి. ఒకవైపు కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు, మరోవైపు పోలీసుల ఇన్వెస్టిగేషన్ మధ్య ఈ కేసులో అనేక మలుపులు తిరుగుతోంది. సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చినప్పటి నుంచి స్టేషన్‌లో జరిగిన పరిణామాల వరకు ప్రతి అంశాన్ని దర్యాప్తు బృందం భూతద్దంతో వెతుకుతోంది. ముఖ్యంగా పోలీసులపైనే ఆరోపణలు వస్తుండటంతో సాక్ష్యాల సేకరణలో అధికారులు అత్యంత గోప్యత పాటిస్తున్నారు. ఏసీబీ దైవప్రసాద్ బృందం నేరుగా సాయికృష్ణ ఇంటికి వెళ్లింది. అక్కడ సాయికృష్ణ తల్లి విజయలక్ష్మి మేనమామ నాగేశ్వరరావు, పిన్ని కనకదుర్గలను సుదీర్ఘంగా విచారించి వారి స్టేట్మెంట్‌లు రికార్డ్ చేశారు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు చేసిన ఆరోపణలు విచరణాధికారులను సైతం విస్మయానికి గురి చేశాయి. సాయికృష్ణను మార్కాపురం నుంచి తీసుకొచ్చి కృష్ణలంక స్టేషన్ లాకప్‌లో ఉంచారని, అక్కడ సీఐ నాగరాజు అతడిని అమానుషంగా చిత్ర వధ చేసి చంపేశారని వారు ఆరోపించారు. కుటుంబ సభ్యుల స్టేట్మెంట్‌ల అనంతరం దర్యాప్తు టీం కృష్ణ లంక స్టేషన్‌కు చేరుకుంది. అక్కడ కేవలం మాటలతో కాకుండా డిజిటల్ ఎవిడెన్స్ ఆధారంగా నిజానిజాలు తేల్చాలని నిర్ణయించింది. స్టేషన్ లోపల, బయట ఉన్న సీసీటీవీ కెమెరాల దృశ్యాలు అత్యంత కీలకం కావడంతో అప్పటికప్పుడు ఫోరెన్సిక్ అండ్ సైబర్ అనాలసిస్ టీమ్ పిలపించారు. వీటిన్నింటినీ అధికారులు సీజ్ చేసి, విశ్లేషణ కోసం నేరుగా ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఆ రాత్రి స్టేషన్‌లో ఏం జరిగిందో తెలుసుకోవడానికి ఈ డిజిటల్ ఆధారాలే ఇప్పుడు కీలకంకానున్నాయి. సాయికృష్ణను మార్కాపురం నుంచి విజయవాడకు ఎప్పుడు తీసుకొచ్చారు? ఈ ఆపరేషన్‌లో ఎవరెవరు పాల్గొన్నవారు? అనే కోణంలో విచారణ సాగుతోంది. టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీ లతాకుమారితోపాటు మరో ఎనిమిది మంది సిబ్బందిని శుక్రవారం దర్యాప్తు టీం విచారించింది. పెండింగ్‌లో ఉన్న ఔఃచి అమలు చేసేందుకే సాయికృష్ణ కోసం నలుగురు సిబ్బందిని మార్కాపురం పంపినట్టు ఏడీసీపీ వివరించినట్టు సమాచారం. అయితే అతడి తీసుకొచ్చిన తర్వాత ఎవరికి అప్పగించారు.?లాకప్‌లో ఉంచిన సమయం ఎంత? అనే ప్రశ్నలకు సమాధానాలు రాబట్టేందుకు వారి స్టేట్మెంట్‌లు రికార్డు చేశారు. కేసు తీవ్రతను దృష్ట్యా, ఈ అదృశ్యం వ్యవహారంపై విచారణాధికారిగా తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్‌ను నియమించారు. ఆయన శుక్రవారం విజయవాడకు చేరుకుని, తొలుత డీజీపీని కలిసి కేసు పురోగతిని వివరించారు. అనంతరం విజయవాడ సీపీ రాజశేఖరబాబును కలిసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నేరుగా కృష్ణలంక స్టేషన్‌కు వెళ్లిన ఎస్పీ, అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని



వ్యక్తిగతంగా ప్రశ్నిస్తూ, ఎక్కడైనా గ్యాప్స్ ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు వేగవంతం చేశారు. ప్రస్తుతానికి దర్యాప్తు బృందం ఎనిమిది మంది కీలక సిబ్బందిని విచారిస్తోంది. ఇందులో టాస్క్‌ఫోర్స్, కృష్ణలంక స్థానిక పోలీసు సిబ్బంది ఉన్నారు.సినీ ఇండస్ట్రీలో సంచలనం సృష్టించిన దృశ్యం' సినిమా కథ అందరికీ గుర్తే. అక్కడ ఒక హత్య జరుగుతుంది, నిందితులు ఎవరో పోలీసులకు స్పష్టంగా తెలుసు. కానీ, బాడీ దొరక్కపోవడంతో హీరో చాకచక్యంగా చట్టం పరిధి నుంచి తప్పించుకుంటాడు. సినిమా చూస్తున్నంత సేపు ప్రేక్షకులు కూడా శవం దొరకకూడదని, హీరో సేఫ్ కావాలని టెన్షన్‌తో కోరుకుంటారు. సరిగ్గా ఇదే తరహా సస్పెన్స్, ఉత్కంఠ ఇప్పుడు విజయవాడ కృష్ణలంకకు చెందిన రౌడీషీటర్ గాదె సాయికృష్ణ అదృశ్యం కేసులోనూ కనిపిస్తోంది. సాయికృష్ణ కనిపించకుండా పోయి నెల రోజులు దాటుతున్నా, అతని ఆచూకీ ఏమైందనే దానిపై అటు పోలీసుల దగ్గర, ఇటు కోర్టుల దగ్గర స్పష్టమైన సమాధానం లేదు. చట్టం ముందు ప్రస్తుతం అతను 'మిస్సింగ్' మాత్రమే."పోలీసులు అతడిని కస్టడీలోనే చంపేశారు.. బూడిద కూడా లేకుండా కాల్పించేశారు" అంటూ వస్తున్న వార్తలన్నీ ప్రస్తుతం కేవలం రాజకీయ ఆరోపణలు, గాసిప్స్‌గానే ప్రచారంలో ఉన్నాయి. ఒకవేళ లాకప్‌లో ఏదైనా అనూహ్య సంఘటన జరిగి ప్రాణాలు పోయి ఉంటే.. సాధారణంగా పోలీసులు ఆసుపత్రికి తరలించడమో, గుండెపోటు అని కవర్ చేయడమో చేస్తుంటారు. కానీ, ఇక్కడ అసలు ఆనవాళ్లే లేకుండా మాయం చేశారనే ప్రచారం దృశ్యం సినిమాలోని పోలీస్ స్టేషన్ కింద శవాన్ని దాచిపెట్టిన ట్విస్ట్‌ను గుర్తుకు తెస్తోంది. ఈ వ్యవహారంలో పటమట, కృష్ణలంక పోలీస్ సర్కిళ్లలో ఏం జరిగిందో ఎవరికీ తెలియదు, పోలీసులు నోరు విప్పడం లేదు. దీంతో ఈ ఉదంతం ఎప్పటికీ ఛేదించలేని ఒక మిస్టరీగా మిగిలిపోనుందా అనే అనుమానాలు బలపడుతున్నాయి.ఈ కేసులో అత్యంత ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. తాము సాయికృష్ణను అసలు అదుపులోకే తీసుకోలేదని పోలీసులు కోర్టుకు గట్టిగా చెప్పలేకపోతున్నారు. సాయికృష్ణతో పాటు మార్కాపురంలో పట్టుబడిన మిగిలిన వారిని పోలీసులు విచారించి అప్పట్లోనే వదిలేశారు. వారితో పాటే సాయికృష్ణను కూడా వేము వదిలేశాం, ఆ తర్వాత అతను ఎక్కడికి వెళ్లాడో మాకు తెలియదు అని చెప్పుకునే లూప్‌హోల్ పోలీసులకు ఉంది. కానీ, తమకు అసలు సంబంధమే లేదని పూర్తిగా తిరస్కరించకుండా, విచారణకు సమయం కోరడమే ఇక్కడ కథను మలుపు తిప్పుతోంది. సాయికృష్ణ ఆనవాళ్లు దొరక్కపోతే, తాము స్టేషన్ నుంచి పంపించేసిన తర్వాతే అతను అదృశ్యమయ్యాడనే వాదనను పోలీసులు తెరపైకి తెచ్చే అవకాశం లేకపోలేదు.దృశ్యం సినిమాలో లాగా శవం దొరక్కపోతే పోలీసులు చట్టపరంగా సేఫ్ అయినట్లేనా అంటే.. న్యాయశాస్త్రం ప్రకారం అలా అనుకుంటే పొరపాటే. కార్పస్ డెలెక్టి సూత్రం ప్రకారం సాధారణంగా నేరాన్ని నిరూపించడానికి భౌతిక ఆధారాలు అవసరమే అయినప్పటికీ.. సుప్రీంకోర్టు పలు సందర్భాల్లో స్పష్టం చేసినట్లు పరిస్థితుల ప్రభావం బలంగా ఉండి, నిందితుడు చివరిసారిగా ఎవరి ఆధీనంలో ఉన్నాడో రుజువైతే శవం లేకపోయినా శిక్ష ఖరారు చేయవచ్చు.'' సాయికృష్ణను పోలీసులు తీసుకెళ్లినట్లు సాక్ష్యాలు ఉన్నాయి కాబట్టి, ఆ తర్వాత అతను ఏమయ్యాడో నిరూపించాల్సిన పూర్తి బాధ్యత సెక్షన్ 106 ప్రకారం పోలీసుల పైనే ఉంటుంది. హైకోర్టు విధించిన గడువు లోగా ఆనవాళ్లు దొరక్కపోతే.. ఈ దృశ్యం' తరహా కథ క్లైమాక్స్ పోలీసులకు చుట్టుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

# ముద్రగడకు భరోసా ఎవరు...

కాకినాడ, జూన్ 22, ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఒకప్పుడు చక్రం తిప్పిన సీనియర్ కాపు నేత, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభరెడ్డి ప్రస్తుతం తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రి పాలయ్యారు. కొంతకాలంగా కిడ్నీ సంబంధిత సమస్యలతో ఇబ్బంది పడుతున్న ముద్రగడ అస్వస్థతకు గురికావడంతో మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రి యశోదకు తరలించారు. అయితే, అక్కడ వైద్య ఖర్చులు ఊహించని స్థాయిలో ఉండటంతో.. ఆ బిల్లులు భరించలేక రాత్రికి రాత్రే ఆయనను సమీపంలోని ఒక చిన్న ప్రైవేట్ ఆస్పత్రికి మార్చడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ముద్రగడను కేవలం రాజకీయ అవసరాల కోసమే వాడుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ , ఇప్పుడు ఆయన వైద్యానికి కనీస భరోసా ఇవ్వకపోవడంపై ముద్రగడ అనుచరులలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.గత సార్వత్రిక ఎన్నికల నుంచి వైసీపీకి కాపు అస్త్రంగా ముద్రగడ ఉపయోగపడ్డారు. ఆయనకు



ఇష్టం లేకపోయినా, వయసు సహకరించకపోయినా.. ఆయన కుమారుడికి రాజకీయ ప్రాధాన్యత ఇస్తామంటూ, భవిష్యత్తు బాగుంటుందంటూ వైసీపీ అగ్రనాయకత్వం ముద్రగడను ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేసిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. చంద్రబాబు నాయుడిని, ముఖ్యంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేస్తూ ముద్రగడతో ఘాటైన లేఖలు రాయించడం, సోషల్ మీడియాలో పోస్టులు పెట్టించడం, ఆఖరికి అనారోగ్యంతో ఉన్నా బలవంతంగా వీడియో బైట్స్ విడుదల చేయించడం వెనుక వైసీపీ వ్యూహకర్తలే ఉన్నారన్నది బహిరంగ రహస్యం. తాజాగా సాయికృష్ణ ఉదంతంలో ఆయనతో ఓ లేఖ రాయించేందుకు ప్రయత్నించారు. కానీ ఈలోపే ఆయన ఆసుపత్రి పాలవ్వడంతో కథ అడ్డం తిరిగింది.హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముద్రగడ వైద్య ఖర్చుల విషయంలో సాయం కోరేందుకు ఆయన కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితులు తాడేపల్లి ప్యాలెస్‌ను, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డిని సంప్రదించేందుకు గట్టిగానే ప్రయత్నించినట్లు సమాచారం. అయితే, ఈ సంప్రదింపుల ప్రయత్నాలు పూర్తిగా విఫలమయ్యాయని టాక్. అసలు ఎవరూ పట్టించుకోలేదు. కార్పొరేట్ ఆసుపత్రి భారీ ఖర్చులకు సంబంధించిన ఆర్థిక భరోసా లేదా సాయంపై ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని తెలుస్తోంది.ముద్రగడ పద్మనాభం లాంటి ఒక సీనియర్ లీడర్‌ను ఆపద సమయంలో వైసీపీ ఒంటరిని చేసిందనే వార్త గోదావరి జిల్లాల్లోని కాపు శ్రేణులను తీవ్ర ఆగ్రహానికి గురిచేస్తోంది. అవసరమైనప్పుడు పవన్ కల్యాణ్‌పైకి ఉసిగొల్పి.. పంతానికి పోయి పేరు మార్చుకునే దాకా ముద్రగడను వాడుకుని, ఇప్పుడు వైద్యం చేయించుకునే పరిస్థితి వస్తే చేతులెత్తేస్తారా అంటూ క్షేత్రస్థాయి అనుచరులు మండిపడుతున్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లను తిట్టడానికే ముద్రగడ పనికొచ్చారా.. ఆయన ప్రాణాల కంటే పార్టీ ప్రయోజనాలే ఎక్కువయ్యాయా? అనే ప్రశ్నలు ఇప్పుడు వెల్లువెత్తుతున్నాయి.ఓ వైపు ముద్రగడ ఆరోగ్యపరిస్థితి బాగోలేక ఆస్పత్రిలో ఉంటే కాపు నాయకుల పేరుతో తోట త్రిమూర్తులు వంటి వారు హడావుడి ప్రారంభించారు. రాజకీయాల్లో యూజ్ అండ్ త్రో జగన్‌కు కొత్తేమీ కాకపోయినా.. ముద్రగడ లాంటి సుదీర్ఘ రాజకీయ చరిత్ర గల నేత విషయంలో ప్రదర్శిస్తున్న వైఖరి ఆ పార్టీ నైతికతను ప్రశ్నార్థకం చేస్తోంది. ప్రత్యర్థులపై బురద చల్లడానికి ఒక సీనియర్ నేత ఇమేజ్‌ను ఎమోషనల్‌గా వాడుకుని, ఆయన ఆరోగ్యం క్షీణించి ఆసుపత్రి బెడ్‌పై ఉంటే ఆర్థికంగా ఆదుకోకపోవడం ముద్రగడ అనుచరులకే కాకుండా తటస్థులకు కూడా మింగుడుపడటం లేదు

# చిత్తూరు జిల్లాలో తీవ్ర విషాదం

### భార్య ఇద్దరు పిల్లలకు విషం తాగించి, తాను ఆత్మహత్య చేసుకున్న తండ్రి

చిత్తూరుభార్య అనారోగ్యంతో తల్లడిల్లిన ఆ కుటుంబం ఆత్మహత్యకు పాల్పడింది. ఆ తండ్రి భార్య ఇద్దరు పిల్లలకు విషం తాగించి, తాను ఆత్మహత్య చేసుకున్నాడు. ఏటీఎం పిన్ రాసిపెట్టి అంత్యక్రియలకు తమ డబ్బులే వాడాలని వినతి చేసాడు. చిత్తూరు జిల్లా దిగుమసపల్లె పంచాయతీలోని బంగారెడ్డిపల్లి గ్రామంలో భార్య నిర్మల(25), కొడుకు రాజేష్(13),కూతురు శ్రీవిద్య(11)లతో కలిసి దామోదరం(30) అనే వ్యక్తి నివసిస్తున్నాడు. బ్రెయిన్ స్ట్రోక్తో చికిత్స పొందుతున్న భార్య పరిస్థితి విషమించడంతో, భార్యా పిల్లలకు విషం తాగించి అనంతరం తాను ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సూసైడ్ నోట్లో ఏటీఎం పిన్ నంబర్, ఫోన్ పే నంబర్ రాసి, అంత్యక్రియలకు తమ డబ్బులే వాడాలని విజ్ఞప్తి చేసాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అనంతపురం టూ అమరావతి...

అనంతపురం జూన్ 22, ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి వేగంగా చేరుకునేలా ఆయా జిల్లాల్లో ప్రభుత్వం పలు ప్రాజెక్టులపై ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో హైవేలు, రోడ్డు విస్తరణ పనులు ప్రారంభంకానున్నాయి. అనంతపురం జిల్లా నుంచి అమరావతికి వేగంగా చేరుకునేలా ప్లాన్ చేశారు. ఈ రోడ్లకు సంబంధించిన పనులు పూర్తిచేస్తే ప్రయాణ సమయం తగ్గుతుందంటున్నారు. రాజధాని అమరావతికి అన్ని జిల్లాల నుంచి కనెక్టివిటీ ఉండేలా ప్లాన్ చేసింది. కేంద్రం సహకారంతో కొత్తగా రోడ్లకు సంబంధించి ప్రాజెక్టుల్ని తీసుకొచ్చే పనిలో ఉంది. అనంతపురం జిల్లా నుంచి అమరావతికి వెళ్లడానికి హైవేలు, రోడ్లకు సంబంధించిన ప్రాజెక్టులు పట్టాలెక్కాయి. విజయవాడ నుంచి బెంగళూరు వెళ్లేందుకు నేషనల్ హైవే-544జీ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మొత్తం 624 కి.మీ.ల గ్రీన్‌ఫీల్డ్ కారిడార్ విజయవాడ నుంచి బెంగళూరుతో కనెక్ట్ చేస్తోంది. విజయవా నుంచి నేషనల్ హైవే 16 మీదుగా వచ్చి ప్రకాశం జిల్లా ముప్పవరం, అద్దంకి మీదుగా హైవే వెళుతుంది. ఈ హైవే పూర్తి చేస్తే 110 కి.మీ.లు దూరం తగ్గి, ప్రయాణ సమయం తగ్గుతుందంటున్నారు. ఈ హైవే ప్రకాశం, నెల్లూరు, కడప, శ్రీ సత్యసాయి జిల్లా మీదుగా వెళుతుంది. అలాగే అనంతపురం జిల్లా నుంచి అమరావతి వెళ్లేందుకు రోడ్ల అనుసంధానంపై ఫోకస్ పెట్టారు.మలకవేముల క్రాస్ దగ్గర జంక్షన్ ఏర్పాటు చేసి బీకేవీ (బెంగళూరు, కదిరి, విజయవాడ) ప్రాజెక్టు ద్వారా అనంతపురం జిల్లా జిల్లా నుంచి అమరావతికి కేవలం 5 గంటల్లో చేరేలా రోడ్డు విస్తరణ పనులు ప్రారంభంకానున్నాయి. ముదిగుబ్బ నుంచి కదిరి వరకు 4 లైన్ హైవేను రూ. 707 కోట్లతో నిర్మించనున్నారు. అనంతపురం, బెంగళూరులను అనుసంధానం చేసే రోడ్లను మలకవేముల క్రాస్ దగ్గర కలుస్తాయి. అక్కడి నుంచి నేరుగా విజయవాడకు వెళ్లేలా ప్లాన్ చేస్తున్నారు. అనంతపురం నుంచి కళ్యాణదుర్గానికి నాలుగు లైన్ల రోడ్డు కూడా ప్రతిపాదించారు. అనంతపురం నుంచి ఉరవకొండకు రోడ్డు ప్రతిపాదన కన్సల్టేషన్ స్థాయిలో ఉంది. గుత్తి - కర్ణాటకలోని బీదర్ హైవే విస్తరణ కూడా చేపట్టారు. అలాగే రూ.230 కోట్లతో గుంతకల్లు - బళ్లారి రోడ్డు విస్తరణకు కొత్తగా టెండర్ పిలిచారు.రాయదుర్గంలో రూ.54 కోట్లతో రైల్వే బ్రిడ్జి, రోడ్డు విస్తరణ పనులు మొదలుకానున్నాయి. రూ.25 కోట్లతో ముదిగుబ్బ నుంచి పుట్టపర్తి రోడ్డు విస్తరణకు టెండర్‌లు ఆహ్వానించారు. కదిరిలో రోడ్లు, డ్రైన్లకు సంబంధించి ఇక రూ.30 కోట్లతో పనులు ప్రారంభించనున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో నేషనల్ హైవే అభివృద్ధి పనులపై ఫోకస్ పెట్టారు. రోడ్ల విస్తరణతో పాటుగా అన్ని పనుల్ని పూర్తి చేస్తే ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయంటున్నారు. మలకవేముల జంక్షన్ కీలకంగా మారుతుందంటున్నారు. ప్రయాణ సమయం తగ్గి అమరావతికి ఐదు గంటల్లో వెళ్లొచ్చంటున్నారు. ప్రస్తుతం బెంగళూరు టు విజయవాడ మధ్య నేషనల్ హైవే-544జీ పనులు కూడా చకచకా సాగుతుండటంతో బెంగళూరు, అనంంతపురం నుంచి అమరావతికి , విజయవాడకు త్వరగా వెళ్లొచ్చు.. ప్రయాణ సమయం తగ్గుతుందని భావిస్తున్నారు.



# ఆరోగ్య నిధి : నల్ల పసుపు మీ వంటింట్లో ఉంటే ఆరోగ్యం మీ వెంటే.. క్యాన్సర్‌తో సహా మాయం!




పసుపు అంటేనే ఆరోగ్యానికి మేలు చేసే దివ్య ఔషధం. అలాంటిది నల్ల పసుపు అంటే దాని ప్రయోజనాలు మరింత ఎక్కువగా ఉంటాయనడంలో సందేహం లేదు. నల్ల పసుపు (బ్లాక్ టర్మెరిక్) చూడటానికి నలుపు రంగులో ఉన్నప్పటికీ, దీని ఆరోగ్య ప్రయోజనాలు మాత్రం అమోఘం. సాధారణ పసుపులో ఉండే గుణాలే కాకుండా, నల్ల పసుపులో ప్రత్యేకమైన పోషకాలు, ఔషధ గుణాలు మెండుగా ఉంటాయి. ఇవి మన శరీరాన్ని అనేక వ్యాధుల నుండి రక్షించడంలో, ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. నల్ల పసుపులోని పోషకాలు, ఔషధ గుణాలు: నల్ల పసుపులో కర్కుమిన్ అనే శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్ సమృద్ధిగా ఉంటుంది. ఇది శరీరంలోని ఫ్రీ రాడికల్స్‌తో పోరాడుతుంది, కణాలను నష్టం నుండి కాపాడుతుంది. అంతేకాకుండా, ఇందులో యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీ బాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు కూడా ఉన్నాయి. విటమిన్లు, ఖనిజాలు కూడా తగినంత మొత్తంలో లభిస్తాయి. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: నల్ల పసుపులో ఉండే యాంటీఆక్సిడెంట్లు, రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. ఇది ఇన్ఫెక్షన్లు, వ్యాధుల నుండి శరీరాన్ని రక్షిస్తుంది. నల్ల పసుపులో యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. శరీరంలో ఎక్కడైనా వాపు, నొప్పి ఉన్నా, నల్ల పసుపు తీసుకోవడం వల్ల ఉపశమనం లభిస్తుంది. కీళ్ల నొప్పులు, కండరాల నొప్పులు, ఇతర వాపు సమస్యలకు ఇది చక్కటి పరిష్కారం. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది: నల్ల పసుపు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇది డయాబెటిస్ ఉన్నవారికి చాలా ఉపయోగకరమైనది.

నల్ల పసుపు జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయం పడుతుంది. ఇది గ్యాస్, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యలను తగ్గిస్తుంది. నల్ల పసుపులో క్యాన్సర్ నిరోధక లక్షణాలు కూడా ఉన్నాయని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇది క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధించడంలో సహాయపడుతుంది. ఇది మానసిక ఆరోగ్యాన్ని కూడా మెరుగుపరు స్తుం దని నమ్ముతారు. ఇది ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. చర్మ సౌందర్యాన్ని పెంచుతుంది: నల్ల పసుపు చర్మానికి కూడా చాలా మేలు చేస్తుంది. ఇది మొటిమలు, మచ్చలు, చర్మంపై ఇతర సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. చర్మాన్ని యవ్వనంగా, కాంతివంతంగా ఉంచడానికి నల్ల పసుపు ఉపయోగపడుతుంది. నల్ల పసుపును ఎలా ఉపయోగించాలి: నల్ల పసుపును కూరల్లో, పప్పుల్లో, ఇతర వంటకాల్లో సాధారణ పసుపులాగే ఉపయోగించవచ్చు. ఈ పొడిని పాలల్లో లేదా నీళ్లలో కలిపి తాగవచ్చు. చర్మ సమస్యల కోసం నల్ల పసుపు పేస్ట్‌ను చర్మంపై నేరుగా అప్లై చేయవచ్చు. నల్ల పసుపు క్యాప్సూల్స్ కూడా మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. వాటిని వైద్య సలహా మేరకు తీసుకోవచ్చు. అయితే నల్ల పసుపు సాధారణంగా సురక్షితమైనది అయినప్పటికీ, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, ఇతర ఆరోగ్య సమస్యలు ఉన్నవారు వైద్య సలహా తీసుకున్న తర్వాతే ఉపయోగించడం మంచిది.

# అందమైన విషం .. పచ్చబొట్టుతో హెచ్ఐవీ, హెపటైటిస్ ముప్పు.. జాగ్రత్త మరి!

పచ్చబొట్టు.. ఈ మాట వినగానే గుర్తొచ్చేది శరీరంపై అందంగా కనిపించే రంగురంగుల చిత్రాలు. ఇప్పుడు యువతలో ఇదొక ఫ్యాషన్‌గా మారిపోయింది. అయితే, ఈ సరదా వెనుక దాగి ఉన్న ప్రమాదాల గురించి ఎంతమందికి తెలుసు? తాజాగా కర్ణాటక ప్రభుత్వం వెల్లడించిన విషయాలు వింటే పచ్చబొట్టు వేయించుకోవాలంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. హెచ్ఐవీ, హెపటైటిస్.. పచ్చబొట్టుతో ప్రమాదం! కర్ణాటక రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దినేశ్ గుండూరావు తెలిపిన వివరాల ప్రకారం, రోడ్డు పక్కన అపరిశుభ్రమైన వాతావరణంలో వేసే పచ్చబొట్ల వల్ల హెచ్ఐవీ, హెపటైటిస్ వంటి ప్రాణాంతక వ్యాధులు సోకే ప్రమాదం ఉంది. నాసిరకం రసాయనాలు కలిపిన పచ్చ ద్రావణం చర్మ పొరల్లోకి, నరాల్లోకి చేరి అనేక రోగాలకు కారణమవుతోందని ఆయన హెచ్చరించారు.విషపూరిత రసాయనాలు పచ్చబొట్టు వేసేటప్పుడు ఉపయోగించే సిరాలో ప్రమాదకరమైన రసాయనాలు ఉంటున్నాయని ఆరోగ్య నిపుణులు గుర్తించారు. చర్మంపై మెరుపు కోసం వాడే కొన్ని రకాల రసాయనాలు, రింగర్ లాక్టేట్ ద్రావణాలు శరీరానికి హాని చేస్తున్నట్లు తేలింది. కర్ణాటకలో పరీక్షించిన 246 రింగర్ లాక్టేట్ బ్యాచ్‌లలో 113 నమూనాలు వినియోగానికి పనికిరావని తేలడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. అసలేంటీ రింగర్ లాక్టేట్? రింగర్ లాక్టేట్ అనేది సాధారణంగా సెలైన్ రూపంలో వాడే ద్రావణం. వైద్య అవసరాల కోసం వినియోగించే ఈ ద్రావణాన్ని పచ్చబొట్టు సిరాలో కలుపుతున్నారు. అయితే, నాణ్యత లేని రింగర్ లాక్టేట్ ద్రావణాల వల్ల చర్మ సంబంధిత సమస్యలతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వం ఏం చేస్తోంది? ఈ ప్రమాదాలను గుర్తించిన కర్ణాటక ప్రభుత్వం అప్రమత్తమైంది. రింగర్ లాక్టేట్ తయారు చేస్తున్న ఫార్మాస్యూటికల్స్ సంస్థలపై కేసులు నమోదు చేసింది. టాటూ ఇంక్‌లో ప్రమాదకర రసాయనాలను కలపకుండా కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది ఈ సూపర్ ఫుడ్స్‌తో సులువుగా బరువు పెరగండి!" పచ్చబొట్టు వేయించుకునే ముందు ఏం చేయాలి? పచ్చబొట్టు వేయించుకోవాలనుకుంటే, ఖచ్చితంగా లైసెన్స్ కలిగిన, నాణ్యమైన ప్రమాణాలు పాటించే స్టూడియోలను ఎంచుకోండి. స్టూడియోలో పరిశుభ్రత ఎలా ఉందో గమనించండి. సూదులు, ఇతర పరికరాలను స్టెరిలైజ్ చేస్తున్నారో లేదో తెలుసుకోండి. పచ్చబొట్టు కోసం ఉపయోగించే సిరా నాణ్యత గురించి ఆరా తీయండి. వీలైతే, దాని గురించి ముందుగానే తెలుసుకునే ప్రయత్నం చేయండి. మీకు ఏవైనా అనుమానాలుంటే, పచ్చబొట్టు వేసే వ్యక్తిని అడిగి నివృత్తి చేసుకోండి. జాగ్రత్తగా ఉండకపోతే.. అపరిశుభ్రమైన పద్ధతుల్లో, నాసిరకం రసాయనాలతో వేసే పచ్చబొట్లు చర్మ వ్యాధులకు కారణమవుతాయి. అంతేకాదు, హెచ్ఐవీ, హెపటైటిస్ వంటి ప్రాణాంతక వ్యాధులు కూడా సోకే ప్రమాదం ఉంది. కాబట్టి, పచ్చబొట్టు వేయించుకునే ముందు అన్ని జాగ్రత్తలు తీసుకోవడం అవసరం. పచ్చబొట్టు వేయించుకోవడం అనేది వ్యక్తిగత ఇష్టం. కానీ, దానివల్ల కలిగే నష్టాల గురించి కూడా తెలుసుకోవడం చాలా ముఖ్యం. సరైన జాగ్రత్తలు తీసుకోకుండా, అపరిశుభ్రమైన చోట్ల పచ్చబొట్లు వేయించుకుంటే, అందం కోసం ఆరాటపడి ఆరోగ్యాన్ని పణంగా పెట్టినట్లే అవుతుంది.



# మెదడులో ప్లాస్టిక్ .. పరిశోధనలో విస్తుపోయే నిజాలు..!



మనిషి జీవితం ప్లాస్టిక్‌తో ఎంతగా పెనవేసుకుపోయిందంటే, అది లేని రోజు ఊహించుకోవడమే కష్టంగా మారింది. కానీ, ఈ ప్లాస్టిక్ వ్యామోహం మనల్ని, భావితరాలను ఎంత ప్రమాదంలోకి నెట్టేస్తుందో తెలుసా? ముఖ్యంగా, కంటికి కనిపించని సూక్ష్మ ప్లాస్టిక్ రేణువులు (మైక్రోప్లాస్టిక్స్) మన శరీరంలోకి, చివరికి అత్యంత సున్నితమైన మెదడులోకి కూడా చొరబడిపోతున్నాయని తాజా పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. న్యూ మెక్సికో యూనివర్సిటీ చేసిన అధ్యయనం ఈ ప్రమాద ఘంటికలను మరింత బలంగా మోగిస్తోంది. మెదడులోకి చొరబడుతున్న ప్లాస్టిక్: మన మెదడు అత్యంత సున్నితమైన అవయవం. బయటి హానికారక పదార్థాలు మెదడులోకి ప్రవేశించకుండా 'బ్లడ్–బ్రెయిన్ బారియర్' అనే రక్షణ కవచం ఉంటుంది. అయితే, ఈ రక్షణ కవచాన్ని సైతం ఛేదించుకొని సూక్ష్మ ప్లాస్టిక్ రేణువులు మెదడులోకి ప్రవేశిస్తున్నాయని న్యూ మెక్సికో యూనివర్సిటీ పరిశోధకులు గుర్తించారు. ఇది అత్యంత ఆందోళన కలిగిస్తుంది.పరిశోధనలో భాగంగా, 2016లో మరణించిన వారి మెదడు కణజాలాలను, 2024లో మరణించిన వారి మెదడు కణజాలాలను పోల్చి చూశారు. 2024 నాటికి మెదడులో సూక్ష్మ ప్లాస్టిక్ రేణువుల సాంద్రత 50 శాతం పెరిగినట్లు గుర్తించారు. అంటే, కేవలం ఎనిమిదేళ్ల వ్యవధిలోనే మెదడులో ప్లాస్టిక్ రేణువులు అంత భారీ మొత్తంలో పెరగడం ఆందోళన కలిగిస్తుందన్నారు పరిశోధకులు. కాలేయం, మూత్రపిండాల వంటి అవయవాలతో పోలిస్తే మెదడులోనే ఈ రేణువులు అధికంగా ఉండటం గమనార్హం. మెదడుపై ప్లాస్టిక్ ప్రభావం: సూక్ష్మ ప్లాస్టిక్ రేణువులు మెదడులో ఎలాంటి దుష్ప్రభావాలకు కారణమవుతాయనే దానిపై ఇంకా పూర్తిస్థాయి పరిశోధనలు జరగాల్సి ఉంది. అయితే, ప్రాథమిక పరిశోధనల ఆధారంగా కొన్ని ప్రమాదకరమైన అంచనాలు ఉన్నాయి . సూక్ష్మ ప్లాస్టిక్ రేణువులు అతి సూక్ష్మ రక్తనాళాల్లో పేరుకుపోయి రక్త ప్రసరణకు ఆటంకం కలిగించే ప్రమాదం ఉంది. దీనివల్ల మెదడుకు అవసరమైన ఆక్సిజన్, పోషకాలు అందక మెదడు పనితీరు దెబ్బతినే అవకాశం ఉంది. అల్జీమర్స్, పార్కిన్సన్స్ వ్యాధులు: మెదడులోని నాడీ కణాలు నిరంతరం సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకుంటూ ఉంటాయి. ఈ ప్రక్రియకు సూక్ష్మ ప్లాస్టిక్ రేణువులు ఆటంకం కలిగించే ప్రమాదం ఉంది. దీనివల్ల జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం, ఇతర మెదడు పనితీరుపై ప్రభావం పడవచ్చు. మెదడులో ప్రోటీన్లు అసాధారణంగా పేరుకుపోవడం వల్ల అల్జీమర్స్, పార్కిన్సన్స్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. సూక్ష్మ ప్లాస్టిక్ రేణువులు ఈ ప్రక్రియను ప్రేరేపించే అవకాశం ఉందని భావిస్తున్నారు.' భవిష్యత్తు తరాలకు ప్రమాదం: ప్లాస్టిక్ కాలుష్యం అనేది నేడు మనం ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్యల్లో ఒకటి. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించకపోతే, భవిష్యత్తులో మరిన్ని తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా, గర్భిణీ స్త్రీలు ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండటం మంచిది. ఎందుకంటే, సూక్ష్మ ప్లాస్టిక్ రేణువులు తల్లి నుంచి బిడ్డకు చేరే ప్రమాదం ఉంది. ఇది పుట్టబోయే బిడ్డ మెదడు ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపవచ్చు. తక్షణ చర్యలు అవసరం: ప్లాస్టిక్ కాలుష్యాన్ని నివారించడానికి తక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వాలు, పరిశ్రమలు, ప్రజలు కలిసికట్టుగా పనిచేయాలి. ప్లాస్టిక్ ఉత్పత్తిని తగ్గించడానికి ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలి. పునర్వినియోగం చేయలేని ప్లాస్టిక్ ఉత్పత్తులపై నిషేధం విధించాలి. ప్లాస్టిక్‌కు బదులుగా పర్యావరణ హితమైన ప్రత్యామ్నాయాలను అందుబాటులోకి తీసుకురావాలి. జనపనార, వెదురు, గాజు వంటి సహజ పదార్థాలతో తయారు చేసిన ఉత్పత్తులను ప్రోత్సహించాలి. ప్లాస్టిక్ వ్యర్థాలను సమర్థవంతంగా నిర్వహించాలి. రీసైక్లింగ్ ప్రక్రియను మెరుగుపరచాలి. ప్లాస్టిక్ కాలుష్యం వల్ల కలిగే ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలి. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోవాలని, పర్యావరణ హిత జీవనశైలిని అలవర్చుకోవాలని ప్రోత్సహించాలి. ప్లాస్టిక్ కాలుష్యం అనేది మానవాళి మనుగడకే ప్రమాదకరంగా పరిణమిస్తోంది. ముఖ్యంగా, సూక్ష్మ ప్లాస్టిక్ రేణువులు మెదడులోకి ప్రవేశించి తీవ్ర అనారోగ్యాలకు కారణమవుతున్నాయనే విషయం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికైనా మేల్కొని ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించుకోకపోతే, భవిష్యత్తు తరాలు తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుంది.

# ఆ మాంసం ఎక్కువ తింటే డయాబెటిస్ ముప్పు!

ప్రస్తుత సమాజంలో డయాబెటిస్ బాధితులు రోజురోజుకీ పెరిగిపోతున్నారు. డయాబెటిస్ మన సమాజాన్ని పట్టి పీడిస్తున్న మహమ్మారిలా తయారైంది. ప్రస్తుత మన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, పని ఒత్తిడి, శారీరక వ్యాయామం లేకపోవడం అంటే అనేక కారణాలు మనలను డయాబెటిస్ బాధితులుగా మారుస్తున్నాయి. అసలు డయాబెటిస్ ఎందుకు వస్తుంది? ఎటువంటి కారణాలతో డయాబెటిస్ వస్తుంది అంటే. డయాబెటిస్ రావటానికి ఈ ఆహారం కారణం డయాబెటిస్ రావడానికి మనం తీసుకునే ఆహారం కూడా కారణమని అనేక అధ్యయనాలు తెలిపాయి. చాలామంది మాంసాహారాన్ని ఇష్టంగా తింటారు. రెడ్ మీట్ ను, ప్రాసెస్ చేసిన మీట్ ను తరచూ తినేవారు ఉన్నారు. అటువంటివారు కచ్చితంగా ఈ విషయం తెలుసుకోవాల్సిందే. ఇంగ్లాండులోని కేంబ్రిడ్జి యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు డయాబెటిస్ ఏ ఆహారం తినేవారికి ఎక్కువ వస్తుందని 20 దేశాలలో 31 అధ్యయనాలు చేశారు. రెడ్ మీట్ తినేవారిలో ఎక్కువ డయాబెటిస్ రిస్క్ ఆ అధ్యయనాలలో ప్రతిరోజు ప్రాసెస్ చేసిన రెడ్ మీట్ తినేవాళ్ళల్లో డయాబెటిస్ వచ్చే ఛాన్స్ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. మొత్తం 19.7 లక్షల మంది పైన డయాబెటిస్ పరీక్షలు నిర్వహించిన వారు ఈ పరిశోధనలో ప్రతిరోజు 50 గ్రాముల ప్రాసెస్ చేసిన మీట్ తీసుకున్న వారిలో 15% డయాబెటిస్ వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని తేల్చారు. అధ్యయనం తేల్చిందిదే ఇక ప్రతిరోజు 100 గ్రాముల ప్రాసెస్ చేసిన ఎర్ర మాంసం తిన్న వారిలో డయాబెటిస్ వచ్చే ప్రమాదం మరో 10 శాతం పెరుగుతుందని తేల్చారు. ఇక అలాగే 100 గ్రాముల పౌల్ట్రీ మాంసం తినే వారిలో డయాబెటిస్ వచ్చే ప్రమాదం మరో ఎనిమిది శాతం పెరిగిందని అధ్యయనంలో వెల్లడైంది. డయాబెటిస్ రాకుండా ఉండాలంటే ప్రాసెస్ చేస్తున్న రెడ్ మీట్ ను తక్కువగా తినాలని సూచిస్తున్నారు. ఈ మాంసం తినొద్దు ప్రాసెస్ చేసిన ఎర్ర మాంసం టైప్ టు డయాబెటిస్ వచ్చే ప్రమాదాన్ని 62% పెంచుతుందని అధ్యయనాలలో వెల్లడైనట్టుగా పేర్కొన్నారు. కనుక మాంసం ప్రియులు టైప్ టు డయాబెటిస్ విషయంలో జాగ్రత్తగా ఉండాలి. సాధ్యమైనంత వరకు ప్రాసెస్ చేసిన ఎర్ర మాంసాన్ని తినకుండా ఉంటేనే మంచిది.






# సౌతాఫ్రికా చేతిలో ఓటమి.. అలా జరిగితేనే సెమీస్‌కు భారత్!

ఐసీసీ మహిళల టీ20 ప్రపంచ కప్ 2026లో భాగంగా సౌతాఫ్రికాతో జరిగి మ్యాచ్‌లో భారత్ ఓటమిపాలైంది. టీమిండియా సెమీస్ అవకాశాలు క్లిష్టంగా మారాయి. ఒక్క ఓటమితో ఫలితాలన్నీ భిన్నంగా మారాయి. ట్రోఫీ గెలవాలనే కసితో ఉన్న టీమిండియాకు రాబోయే రెండు మ్యాచులు చాలా కీలకం కానున్నాయి. ఒక్క మ్యాచ్ ఓడినా సెమీస్ ఆశలు దాదాపు గల్లంతైనట్లే అని క్రీడా నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం సౌతాఫ్రికా ఓటమి తర్వాత భారత్ సెమీస్ అవకాశాలు ఎలా ఉన్నాయో ఒకసారి పరిశీలిద్దాం.నిన్న దక్షిణాఫ్రికా బ్యాటర్ మారిజెన్ కాప్ (81 నాటౌట్) సంచలన ఇన్నింగ్స్‌తో ఆరు వికెట్ల తేడాతో టీమిండియాపై గెలుపొందింది. ఈ విజయంతో సౌతాఫ్రికా రెండు విజయాలు సాధించి పట్టికలో మూడో స్థానంలో ఉంది. మూడు మ్యాచ్‌ల్లో రెండు విజయాలతో బంగ్లాదేశ్ నాలుగో స్థానంలో ఉంది. అయితే భారత్ తొలి రెండు మ్యాచ్‌లు భారీ తేడాతో గెలవడంతో మెరుగైన నెట్ రన్‌రేట్ (+2.511) కారణంగా పట్టికలో సౌతాఫ్రికా(-0.546), బంగ్లాదేశ్(-0.641) కంటే ముందుంది. ఆసీస్ ఆడిన మూడు మ్యాచుల్లో గెలిచి.. సెమీస్ రేసులో ఒక మెట్టు పైనే ఉంది.ఇక భారత తమ చివరి రెండు మ్యాచ్‌లను ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్‌తో ఆడాల్సి ఉంది. ఈ రెండింటిలోనూ హర్మన్ సేన గెలిస్తే 8 పాయింట్లతో నెట్ రన్‌రేట్‌తో సంబంధం లేకుండా నేరుగా సెమీస్‌కు చేరుతుంది. అలా కాకుండా ఒక మ్యాచ్‌లో గెలిచి మరో మ్యాచ్‌లో ఓడితే మాత్రం నెట్ రన్‌రేట్ కీలకం కానుంది. అదే సమయంలో సౌతాఫ్రికా కూడా ఒక మ్యాచ్ ఓడిపోవాలి. ప్రస్తుతం సౌతాఫ్రికా, బంగ్లాదేశ్‌లతో పోలిస్తే భారత్ రన్‌రేట్ చాలా మెరుగ్గా ఉంది.ఒకవేళ ఆస్ట్రేలియా చేతిలో ఓడినా బంగ్లాదేశ్‌తో మ్యాచ్‌లో భారీ తేడాతో గెలిస్తే టీమిండియాకు సెమీస్ చేరే అవకాశాలు మెండుగా ఉంటాయి. బంగ్లాదేశ్ మనపై విజయం సాధిస్తే మాత్రం రన్‌రేట్ పడిపోయి హర్మన్ ప్రీత్ కౌర్ సేన ఎలిమినేట్ అయ్యే ఛాన్స్ ఉంది. ఇక భారత్ తాను ఆడబోయే రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటమిపాలైతే మాత్రం టోర్నీ నుంచి నేరుగా నిష్క్రమిస్తుంది. అప్పుడు సెమీస్ బెర్తు కోసం సౌతాఫ్రికా, బంగ్లాదేశ్ పోటీ పడతాయి. ఆస్ట్రేలియా మాత్రం మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో ఒక్కటి గెలిచినా సెమీస్ బెర్తు ఖరారు చేసుకుంటుంది.




# విధ్వంసం.. ఒకే ఓవర్లో ఐదు సిక్స్‌లు..

: మేజర్ లీగ్ క్రికెట్ (ఓఎఅ 2026) ఆరో మ్యాచ్‌లో లాస్ ఏంజెలెస్ నైట్ రైడర్స్ విధ్వంసకర బ్యాటర్ రోవ్‌మన్ పావెల్ సిక్సర్ల తుఫాన్ సృష్టించాడు. సియాటెల్ ఓర్కాస్‌తో జరిగిన మ్యాచ్‌లో లంక ఆల్‌రౌండర్ దాసున్ శనక వేసిన ఒకే ఓవర్లో వరుసగా 5 సిక్సర్లు బాది స్టేడియాన్ని హోరెత్తించాడు. 15వ ఓవర్లో నైట్ రైడర్స్ జట్టు 5 వికెట్ల నష్టానికి 136 పరుగులతో ఒత్తిడిలో ఉన్న సమయంలో క్రీజులోకి వచ్చిన పావెల్ కేవలం 11 బంతుల్లోనే 37 పరుగులు (5 సిక్సర్లు, 1 ఫోర్) చేసి మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు.ఇన్నింగ్స్ 17వ ఓవర్లో ఈ హై వోల్టేజ్ డ్రామా చోటుచేసుకుంది. శానక వేసిన మొదటి ఐదు బంతులను మైదానం నలుమూలలా స్టాండ్స్‌లోకి పంపిన పావెల్.. గతంలో యువరాజ్ సింగ్ పేరిట ఉన్న ఆరు బంతులకు ఆరు సిక్సర్ల ప్రపంచ రికార్డును సమం చేసేలా కనిపించాడు. అయితే, ఆఖరి బంతికిని శానక తెలివిగా వేయడంతో మరో సిక్సర్ కొట్టే ప్రయత్నంలో టైమింగ్ మిస్సై థర్డ్ మ్యాన్ వద్ద క్యాచ్ ఔటయ్యాడు. దీంతో యువరాజ్ రికార్డు త్రుటిలో చేజారింది. అయినప్పటికీ ఈ మెరుపు ఇన్నింగ్స్‌తో నైట్ రైడర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 196 పరుగుల భారీ స్కోరు సాధించింది.అనంతరం 197 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సియాటెల్ ఓర్కాస్ జట్టు నైట్ రైడర్స్ బౌలర్ల ధాటికి విలవిల్లాడింది. ఓపెనర్ టిమ్ సీఫెర్ట్ (5) తక్కువ పరుగులకే అవుట్ కాగా, ఏ ఒక్క బ్యాటర్ క్రీజులో కాసేపు కూడా ఉండలేకపోయారు. ఆండ్రీ రస్సెల్, వాన్ షాల్క్‌విక్ చెరో 3 వికెట్లతో విరుచుకుపడటంతో సియాటెల్ జట్టు 115 పరుగులకే కుప్పకూలింది. దీంతో లాస్ ఏంజిల్స్ నైట్ రైడర్స్ 81 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి టోర్నీలో తమ విజయ పరంపరను కొనసాగించింది. మొత్తంగా పావెల్ కొట్టిన వరుస ఐదు సిక్సర్ల వీడియో సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది.




# ఫిఫా ప్రపంచ కప్: లాకర్ రూమ్‌లో ఇరాన్ జట్టు నోట్!

ఫిఫా ప్రపంచ కప్‌లో ఇరాన్ జట్టు ప్లేయర్లు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న సంగతి తెలిసిందే. ఈ టోర్నీ సహ ఆతిథ్య దేశం అమెరికా.. కొందరు ఇరాన్ ప్లేయర్ల వీసా అనుమతి నిరాకరించింది. దీనివల్ల మ్యాచ్ ముగిసిన తర్వాత విశ్రాంతి తీసుకునే అవకాశమే లేకుండా దేశాన్ని వదిలి వెళ్లాల్సి వస్తోంది. న్యూజిలాండ్‌తో తొలి మ్యాచ్ 2-2తో డ్రా అవ్వగా.. తాజాగా బెల్జియం జట్టుతో ఇరాన్ మ్యాచ్ 0-0తో డ్రా అయింది. లాస్ ఏంజెలెస్‌లోని సోఫీ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్ అనంతరం ఇరాన్ ప్లేయర్లు భావోద్వేగంతో ఓ లేఖ రాసి లాకర్ రూమ్‌లో వదిలి వెళ్లారు.'ప్రాచీన పర్షియా నుంచి ఇప్పటి ఇరాన్ వరకు మా దేశ ప్రజల వ్యక్తిత్వం స్థిరంగానే ఉంది. ఈ టోర్నీలో లాస్ ఏంజెలెస్‌కు వచ్చి గౌరవంగా పోటీ పడ్డాం. సగర్వంగా ఇక్కడి నుంచి వెళ్తున్నాం. మీ ఆతిథ్యానికి ధన్యవాదాలు. ఈ మ్యాచ్ జరిగిన 180 నిమిషాల పాటు మాకు మద్దతుగా నిలిచిన ఇరాన్ అభిమానులకు కృతజ్ఞతలు. అన్ని దేశాల మధ్య శాంతి, స్నేహం ఉండాలి' అని ఇరాన్ ప్లేయర్లు ఆ లేఖలో పేర్కొన్నారు. అయితే చ168, చఎతినిజీఎ అనే హ్యాష్‌ట్యాగ్‌లు కూడా ఈ లేఖలో ప్రస్తావించడం చర్చనీయాంశంగా మారింది. ఇరాన్‌లో జరిగిన సంఘటనలను సూచించే ఈ హ్యాష్‌ట్యాగ్‌లు రాజకీయ భావోద్వేగాన్ని కూడా ప్రతిబింబిస్తున్నాయి.టోర్నమెంట్ సమయంలో ఇరాన్ జట్టు తీవ్ర సమస్యలను ఎదుర్కొంటోంది. వీసా పరిమితులు, ప్రయాణ ఆంక్షల కారణంగా జట్టు మెక్సికోలోని టిజువానా నుంచి ప్రతి మ్యాచ్‌కు అమెరికాకు ప్రయాణించాల్సి వస్తోంది. కొందరు సిబ్బందికి వీసాలు రాకపోవడం, ఆటగాళ్లకు ప్రయాణ ఇబ్బందులు కూడా ఎదురయ్యాయి. ఈ పరిస్థితులపై ఇరాన్ కోచ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఈ టోర్నమెంట్‌లోనే అత్యంత ఒత్తిడికి గురైన జట్టు ఇరాన్ అని తెలిపాడు. గ్రూప్ దశలో ఇరాన్ రెండు మ్యాచ్‌ల్లో 2 పాయింట్లు సాధించి నాకౌట్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. చివరి మ్యాచ్‌లో ఈజిప్ట్ జట్టుతో తలపడనుంది.




# మహిళా క్రికెటర్లకు తీపికబురు.. 'అమ్మ'గా ఆటలో రాణించేందుకు అండగా ఐసీసీ..!



మహిళా క్రికెటర్లకు మరింత భరోసా కల్పించే దిశగా అంతర్జాతీయ క్రికెట్ మండలిమరో ముందడుగు వేసింది. మాతృత్వ దశలో మహిళా క్రికెటర్లకు ఆర్థికంగా, వైద్య పరంగా సాయం అందించేందుకు ఐసీసీ సిద్ధమవుతోంది. బిడ్డను కన్న తర్వాత అమ్మగా.. మళ్లీ క్రికెట్ ఆడే వారికోసం కొన్ని మార్గదర్శకాలు రూపొందించింది అత్యున్నత క్రికెట్ మండలి. మహిళా ప్లేయర్లు పిల్లలకు జన్మనివ్వడం నుంచి.. మళ్లీ మైదానంలోకి దిగేంత వరకూ వారికి పెద్దన్నలా అన్ని విధాలా సాయం అందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఐసీసీ వెల్లడించింది.ఐసీస ఈవెంట్లో పురుష క్రికెటర్లతో సమానంగా మహిళా క్రికెటర్లకు వేతనాలు చెల్లిస్తున్న ఐసీసీ.. మరో కీలక నిర్ణయం తీసుకుంది. తల్లైన తర్వాత మళ్లీ క్రికెట్ ఆడాలనుకునే మహిళా ప్లేయర్లకు అడుగడుగునా భరోసాగా నిలువనుంది. గర్భం దాల్చిన అనంతరం, ఆపై ప్రసవం అనంతరం శారీరక, మానసిక మార్పులకు లోనయ్యే మహిళా క్రికెటర్లకు అనుకూలమైన వాతావరణంలో శిక్షణ ఇవ్వాలని ఐసీసీ భావిస్తోంది.అలానే.. వారి పిల్లలను చూసుకోవడం, గర్భిణిలకు రవాణా, మెడిసిన్ ఖర్చులు భరించడం వంటివి చూసుకోనుంది. చాలామంది క్రికెటర్లు కెరీర్ సమయంలోనే వైవాహిక జీవితం వైపు మొగ్గు చూపిస్తున్న నేపథ్యంలో ఐసీసీ ఈ నిర్ణయాలను అనుసరించాలనుకుంటోంది. ఆస్ట్రేలియా మహిళల జట్టు డాక్టర్ ఫిలిప్పా ఇంగే నేతృత్వంలోని ఐసీసీ వైద్య సలహా కమిటీ సూచనల మేరకు ఈ కార్యాచరణను రూపొందించారు.కాన్పు అనంతరం క్రికెట్ ఆడేందుకు సిద్ధపడే వారికోసం ఆరు దశల ప్రణాళిక ఉంది. రెడీ, రివ్యూ, రిస్టోర్, రీ-కండీషన్, రిటర్న్, రిఫైన్.. ఈ ఆరు విధానాలను అనుసరించి అమ్మలైన క్రికెటర్లను తిరిగి ఆటవైపు మళ్లించాలని ఐసీసీ భావిస్తోంది. అందుకోసం డాక్టర్ లేదా ఫిజియోథెరపిస్ట్‌ను నియమించనున్నారు. మూడో ట్రెమిస్టర్.. కాన్పు తర్వాత ఆరు లేదా ఎనిమిది వారాలకు క్రికెట్ సన్నాహకాలు ప్రారంభించడం వంటివి ఫిజియోథెరపిస్ట్ చూసుకుంటారు. 2021లో బిడ్డను కన్న వెస్టిండీస్ స్పిన్నర్ అఫీ ఫ్లెచర్ ఇప్పుడు క్రికెట్ ఆడుతోంది. ఫ్లెచర్ మాదిరిగానే మరికొందరు మాతృత్వం అనంతరం ఏ ఇబ్బందులు లేకుండా మైదానంలో మెరిసేలా ఐసీసీ చొరవ చూపిస్తోంది.

# ౯౨ ఏళ్ల నిరీక్షణ.. ఫిఫా వరల్డ్‌కప్‌లో ఈజిప్ట్‌కు తొలి విక్టరీ



న్యూయార్క్: ఫిఫా వరల్డ్‌కప్‌లో ఈజిప్ట్ విక్టరీ కొట్టింది. న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో 3-1 గోల్స్ తేడాతో విజయం సాధించింది. ఓ దశలో వెనుకబడ్డ ఈజిప్ట్ ఆ తర్వాత పుంజుకుని వరల్డ్‌కప్ హిస్టరీలో చరిత్ర సృష్టించింది. వరల్డ్‌కప్‌లో అరంగేట్రం చేసిన దాదాపు 92 ఏళ్ల తర్వాత ఆ దేశం తొలిసారి మ్యాచ్ నెగ్గింది. ఈజిప్ట్ జట్టులో మొహమ్మద్ సలేహ్ కీలక ప్లేయర్‌గా నిలిచాడు. ఓ గోల్ చేయడంతో పాటు మరో గోల్‌కు అసిస్ట్ చేశాడు. వరల్డ్‌కప్ చరిత్రలో తొలిసారి ఈజిప్ట్ ఓ విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నది. గ్రూప్ జీ నుంచి పోటీపడుతున్న ఈజిప్ట్.. టోర్నీ చరిత్రలో తొలిసారి రెండో దశకు క్వాలిఫై అయ్యే అవకాశాలు ఉన్నాయి.ఫస్ట్ హాఫ్‌లో న్యూజిలాండ్ లీడ్ తీసుకున్నది. ఫిన్ సుర్మన్ ఓ గోల్ చేశాడు. 15వ నిమిషంలోనే గోల్ కొట్టి జట్టుకు ఆధిక్యాన్ని ఇచ్చాడు. కానీ సెకండ్ హాఫ్‌లో ఈజిప్ట్ ప్లేయర్లు దుమ్మురేపారు. కేవలం 24 నిమిషాల వ్యవధిలోనే మూడు గోల్స్ చేశారు. దీంతో గ్రూప్ జీ నుంచి ఆ జట్టు ప్రస్తుతం టాప్‌లో నిలిచింది. ఈజిప్ట్ నాలుగో సారి వరల్డ్‌కప్ ఆడుతోంది. 1934లో తొలిసారి ఆ దేశం వరల్డ్‌కప్ ఆడింది. ఒకవేళ శనివారం ఇరాన్‌తో జరిగే మ్యాచ్‌లో ఆ దేశం గెలిస్తే వాళ్లు గ్రూప్ నుంచి నాకౌట్‌కు అర్హత సాధించే అవకాశాలు ఉన్నాయి. ఈ టోర్నీలో న్యూజిలాండ్ ఇంకా తన ఖాతాను తెరవలేదు. శనివారం బెల్జియంతో ఆ జట్టు ఆడనున్నది.

# ఐపీఎల్‌లో ట్రేడ్ డీల్: రాజస్థాన్ రాయల్స్‌కు హార్దిక్ పాండ్య!

ఐపీఎల్‌లో మరో భారీ ట్రేడ్ చర్చలు క్రికెట్ వర్గాల్లో సంచలనం రేపుతున్నాయి. ముంబై ఇండియన్స్ కెప్టెన్, స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్య జట్టును వీడే సంకేతాలు బలంగా కనిపిస్తున్నాయి. రాజస్థాన్ రాయల్స్ జట్టు హార్దిక్‌ను తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ప్రతిగా ఆర్ఆర్ యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ ముంబైకి వెళ్లనున్నట్లు తెలుస్తోంది. ఈ విషయంపై ఇరు ఫ్రాంచైజీల మధ్య చర్చలు జరుగుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.ఐపీఎల్ 2026లో ముంబై ఇండియన్స్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన సంగతి తెలిసిందే. దీంతో జట్టులో భారీగా మార్పులు చేయడానికి ఫ్రాంచైజీ సిద్ధమైనట్లు సమాచారం. అందులోనూ హార్దిక్ పాండ్య ముంబై కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అతడిపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి. డ్రెస్సింగ్ రూమ్‌లో అసంతృప్తి, అంతర్గత విభేదాల కారణంగా హార్దిక్ ఒత్తిడి గురవుతున్నట్లు తెలుస్తోంది. స్వయంగా అతడే జట్టును వీడాలని నిర్ణయించుకున్నట్లు క్రికెట్ వర్గాల సమాచారం. మరోవైపు సూర్యకుమార్ యాదవ్ సహా పలువురు సీనియర్ ప్లేయర్ల విషయంలోనూ ట్రేడ్ చర్చలు జరుగుతున్నట్లు నివేదికలు పేర్కొన్నాయి.రాజస్థాన్ రాయల్స్ యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ భవిష్యత్తుపై కూడా కొంతకాలంగా ఊహాగానాలు కొనసాగుతున్నాయి. వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్ కారణంగా యశస్విపై ఒత్తిడి పెరిగిపోతుందని మాజీ క్రికెటర్లు కూడా వ్యాఖ్యానించారు. ఒత్తిడి కారణంగా పరుగులు చేయలేకపోతున్నాడంటూ అభిప్రాయపడ్డారు. మరోవైపు ఆర్ఆర్ అతడిని ప్రధాన ప్లేయర్‌గా తీర్చిదిద్దే అవకాశం ఉన్నప్పటికీ.. అనూహ్యంగా కెప్టెన్సీ బాధ్యతలు రియాన్ పరాగ్‌కు అప్పగించారు. దీంతో పరిస్థితులు మారిపోయాయి. ఈ క్రమంలో యశస్వి జైస్వాల్ కూడా ఫ్రాంచైజీ మారడానికి ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. కాగా హార్దిక్-యశస్వి ట్రేడ్ నిజంగా జరిగితే.. అది ఐపీఎల్ చరిత్రలోనే అత్యంత సంచలన నిర్ణయాల్లో ఒకటిగా నిలుస్తుంది. ఈ పరిణామాల నేపథ్యంలో ఫ్రాంచైజీ తదుపరి నిర్ణయాలపై ఇప్పుడు క్రికెట్ ప్రపంచంగా ఆసక్తిగా ఎదురుచూస్తోంది.

# సినిమా

## ఏఐ యుగంలో కూడా చివరి శ్వాస వరకు పని చేస్తూనే పోవాలి - సీనియర్ దర్శకుడు అల్లాణి శ్రీధర్




అల్లాణి శ్రీధర్ తెలుగు సినిమా రచయిత, నిర్మాత, దర్శకుడు. 1988లో కొమరంభీమ్ చిత్రంతో దర్శకత్వ అరంగేట్రం చేశారు. ఉత్తమ జాతీయ సమైక్యత చిత్రంగా, ఉత్తమ దర్శకుడుగా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం నుండి 1990లో నంది అవార్డు అందుకున్నారు ఈయన.

ఆయన తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన గద్దర్ అవార్డ్స్ విధివిధానాల కమిటీలో సభ్యునిగా పని చేశాడు. జూన్ 24.6.2026 అల్లాణి శ్రీధర్ పుట్టినరోజు సందర్భంగా ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ ఆయనకు ఫిలింఛాంబర్‌లో మీట్ ది ప్రెస్ కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమానికి ఎగ్జిక్యూటివ్ మెంబర్ సీనియర్ జర్నలిస్ట్ ధీరజ్ అప్పాజీ వ్యాఖ్యతగా వ్యవహరించారు.

ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్ట్ బాలిరెడ్డి మాట్లాడుతూ... గోస్వామి తులసిదాస్' సినిమా అన్నది మనం మర్చిపోలేని సినిమా అని గుర్తు చేయడం జరిగింది. శ్రీధర్‌గారితో నాకు చాలా ఏళ్ళ అనుబంధం ఉంది. ఆయన మరిన్ని చిత్రాలు తీసి సక్సెస్ సాధించాలని కోరుకుంటున్నాను అన్నారు.

సీనియార్ జర్నలిస్ట్ లక్ష్మణరావు మాట్లాడుతూ...' శ్రీధర్‌గారితో అనుబంధం కొంత గ్యాప్ వచ్చినప్పటికీ.. ఆ రోజుల్లో ఆయన చేసిన సినిమాలు అభ్యుదయ భావాలకు ప్రతీకగా నిలిచాయి. ఆయన స్వయం కృషితో చేసిన సాధనలు. మరెన్నో మంచి కార్యక్రమాలు చేయాలని మరిన్ని సినిమాలు తీయాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము అని అన్నారు.

శ్రీమతి జమునారాణి సీనియర్ జర్నలిస్ట్ మాట్లాడుతూ...ఈ వేదికపైన రెండు విషయాలు చెప్పుకోవాలంటే సంతోషంగా ఉంది. చాలా రోజుల తర్వాత ఫిలిం క్రిటిక్స్ అసోసియేషన్ కళకళలాడుతుంది. ఎంతోమంది సీనియర్ పాత్రికేయులను కలవడం ఆనందంగా ఉంది. శ్రీధర్ గారి గురించి ఎంత చెప్పినా తక్కువే అని అన్నారు.

సీనియర్ జర్నలిస్ట్ ఆర్.డి.ఎస్ ప్రకాశ్ మాట్లాడుతూ... శ్రీధర్‌గారితో నాకు దాదాపుగా 25ఏళ్ళుగా పరిచయం ఉంది. అప్పట్లో నేను ఒక ఆర్టికల్‌ని చదివాను రగులుతున్న భారతం అనే టైటిల్ పెట్టారు. దాని గురించి ఆయనకు చెప్పాను మీరు చాలా బాగా దాసరిగారితో..అక్కినేనిగారితో చేస్తున్నారు. అని చెప్పి ఆ ఆర్టికల్ గురించి ప్రస్తావిస్తూ... ఆయన సినిమాలు చాలా ఉన్నాయి. మరిన్ని సినిమాలు చేసి.. కమర్షియల్ సక్సెస్‌లు మరిన్ని సాధించాలని కోరుకుంటున్నాను అన్నారు.

ఫిలిం క్రిటిక్స్ అధ్యక్షులు బత్తుల ప్రసాద్ మాట్లాడుతూ..ఈ మీట్ ది ప్రెస్ కార్యక్రమం ద్వారా ప్రతిభ ఉన్న ప్రతి ఒక్కరికీ చిరు సత్కారం చేయాలని అనుకుంటున్నాము. అల్లాని శ్రీధర్ గారి గురించి చెప్పాలంటే నా గరించి నేను చెప్పుకున్నట్లు ఉంటుంది. ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే. ఆయన నాకు సోదరుడితో సమానం అన్నారు.

ఫిలిం క్రిటిక్స్ జనరల్ సెక్రటరీ సురేష్‌కొండేటి మాట్లాడుతూ... వార్తలో ఉన్నప్పుడు నేను 90లలో నేను శ్రీధర్‌గారిని ఇంటర్వ్యూ చేయడం జరిగింది. అంతేకాక ఆతరువాత సంతోషం సినీ వారపత్రికకు కూడా ఆయనను నేను పర్సనల్‌గా ఇంటర్వ్యూ చేశాను. ఆయన గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలి. ఈ కార్యక్రమాన్ని మా ద్వారా చేసే అవకాశం కల్పించినందుకు చాలా సంతోషంగా ఉంది. మాకు ఇంత చక్కని అవకాశం కల్పించినందుకు ఆయనకు కృతజ్ఞతలు అన్నారు.

అల్లాణి శ్రీధర్ మాట్లాడుతూ... నేను జన్మదినం అనేది గొప్పగా అనుకోవడం లేదు. ఈ రోజు ఈ వేదికపైన ఇంత మంది మిత్రలును కలు

సుకోవడం నా జన్మ దినం కాదుగాని పునర్మనదినంగా అనుకుంటున్నాను అన్నారు. నేను కొమరం భీమ్ చేసే రోజుల్లో అడవుల్లో ఉన్నప్పుడు మా మిత్రుడు ప్రభు జర్నలిస్టులను తీసుకొచ్చి కవరేజ్ చేసేవాళ్ళు కొమరం భీమం సినిమా విడుదల 18 ఏళ్ళు ఇబ్బంది పడాల్సి వచ్చింది. కానీ విడుదలయ్యాక అది నాకొక గుర్తింపుని తీసుకొచ్చింది. దాసరిగారు ఎప్పటికైనా సింహమే. దర్శకుడిగా లెజండ్ అని చెప్పాలి. ఆయనతో నాకు చాలా మంచి అనుబంధం ఉంది. ఆయన ఏదైనా సరే ఒక సీన్‌ని డైరెక్ట్ చేసి తిరిగి మళ్ళీ అడిగేవారు.. అదే విధంగా అక్కినేని నాగేశ్వరావుగారు ఆయన ఏదైనా షూటింగ్ సమయంలో డౌట్లు వస్తే వెంటనే అడిగి తెలుసుకునేవారు. ఈ షాట్ క్లోజప్ పెట్టారు ఎందుకని అని ప్రతిదీ నన్ను అడిగేవారు. ఇంతమంది గొప్పవాళ్ళతో పనిచేసే అదృష్టం దేవుడు మనికి ఇచ్చారు. నన్నువాళ్ళు చాలా బాగా అభిమానించేవారు. నేను నా వృత్తిలో ఏ రోజు సెలవు తీసుకోలేదు. కొమరం భీమ్ నుంచి ఇప్పటి వరకు సెలవు లేదు. ఏఐ స్టూడియోస్ పెట్టి కొన్ని సినిమాలు చేస్తున్నాను. ప్రముఖ వ్యక్తి బయోపిక్ చేస్తున్నాము. ఒక పెద్ద కంఎనీతో కలిసి పని చేస్తున్నాను. అది అధికారికంగా వాళ్ళు ఎనౌన్స్ చేస్తారు అని అన్నారు. అదే విధంగా ఈ మధ్య కాలంలో నా మదిలో ఓ చిన్న వెలితి ఉ ండిపోయింది. చిన్న పిల్లలకు సంబంధించిన సినిమాలు అసలు లేనే లేవు. ఇంటర్నేషనల్ ఫిలింఫెస్టివల్లో జ్యూరీలో నేను పని చేశాను. బాలల చిత్రాలు చాలా అరుదు అయిపోయాయి. పిల్లలచేతుల్లో కేవలం మొబైల్ ఫోన్లు ఎక్కువయిపోయాయి. దీంతో సోషల్ మీడియా ఎక్కువయిపోయింది. మొబైల్ వ్యసనంగా మారిపోయింది. దానికోసం చిన్న పిల్లల కోసం బాలల చిత్రాలు చేయాలనుకుంటున్నాము. నేను నా మిత్రులు కలిసి చేయాలనుకుంటున్నాము. బయెపిక్ , ఏఐ సినిమాలు, వెబ్‌సిరీస్ ఇలా చాలా ప్రాజక్టులు అనుకుంటున్నాము అన్నారు. ఇటీవలె సింగీతం శ్రీనివాస్‌గారు ఈ వయసులో కూడా ఒక అద్భుతమైన సినిమా చేశారు. ఆయన ఇన్‌స్పిరిషన్ అని కాదు. నాగేశ్వరావుగారు యాక్టింగ్ చేస్తూనే పోవాలని అనుకుంటున్నాను అన్నారు. ఇలా చివరి శాస వరకు పని చేస్తూనే ఉండాలన్నది నా కోరిక అన్నారు. నేను కూడా యాక్షన్ చెపుతూనే కట్ చెప్పే సమయంలో మనం వెళ్ళిపోవాలి అన్నది నా కోరిక అన్నారు. ప్రతి రోజు కొత్త రోజే మనకు ఇంత మంచి అవకాశం సందర్భం కలిపించిన వారందరికీ సురేష్‌గారికి బత్తులగారికి నా ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు.

–కరోనా దగ్గర నుంచి ప్రేక్షకుల అభిప్రాయం బాగా మారిపోయింది. బలగం అనే సినిమాలు ఆదరణ ఉ ంటుంది. చాలా మంది చూస్తున్నారు. ప్రేక్షకుల అభివృద్ధి చూసుకుని వెళ్లాల్సిందే.

× బాలల సినిమాల్లో కొంత మంది బాలలని నటులుగా తీసుకుని రాజేంద్రప్రసాద్ ఇలా కొంత మంది ఆర్టిస్టులతో సినిమాలు చేయాలన్నది మా ప్లాన్

× సినిమా అనేది ఒక రెవెల్యూషన్ లా అయిపోయింది. మాధ్యమాలు మారిపోయాయి కాబట్టి కుటుంబానికంటే కూడా డబ్బుకంటే కూడా ఐడియాకే ఎక్కువ శక్తి ఉన్న సమయం ఇది. ఒక ఐడియా అనేది శిఖరం లాంటిది.

× ఏఐ అనేది 24 క్రాఫ్ట్సని కిల్ చేస్తుందని అనుకుంటున్నారు.. కానీ అది పరెగెత్తిస్తుంది తప్ప కిల్ చేయడం లేదు. మన ఐడియాని రిఫైండ్ చేస్తుంది. ఏఐ అనేది అద్భుతమైన భవిష్యత్తు నిర్మిస్తుంది. ఏఐ స్టూడియో పెట్టారు. ఇండస్ట్రీలో ఎలాంటి ఎఫెక్ట్ చూపిస్తుంది. టెక్నీషియన్స్ తమ నైపుణ్యాన్ని మెరుగుపరుస్తారు అంతే తప్ప ఉద్యోగాలు పోవు.

× ఏఐ కూడా ఒక సాధన లాంటిది. అనవసరమైన భయం అపోహలు తప్ప ఒక అద్భుతమైన ఊహలను నిజం , చేసుకునే లాంటిది.


× పిల్లలకు సినిమాలు లేకుండా చేయడం అనేది సరైనది కాదు. ప్రతి ఒక్కరి బాధ్యత. కేవలం ప్రభుత్వమే కాదు సమాజం కూడా బాధ్యత ఉంది. పిల్లలు కోసం సినిమా అనేది కల కాదు. నిజం.

× సినిమా బడ్జెజ్ కథను బట్టి ఉంటుంది. తారలను బట్టి మార్కెట్‌ని బట్టి డిమాండ్ ఉంటుంది. హై బడ్జెట్‌ని తప్పుబట్టాల్సిన అవసరం లేదు. సరిగా తీయకపోతే డబ్బులు వెనక్కిరావు. సినిమా అనేది రెండు కోట్లతో మొదలుపెట్టి ఎంతైనా పెట్టుకోవచ్చు. సబ్జెక్ట్‌ని బట్టి సినిమా బడ్జెట్ ఉంటుంది.

ఇంకా ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ శ్యామ్ కుమార్, శ్రీమతి పర్వీన్‌బాబి, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ మామిడాల గిరిధర్, ఆర్.డి.ఎస్ ప్రకాశ్, కేశవాచారి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా “ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్” మూవీ సక్సెస్ మీట్

సామాజిక ఇతివృత్తాల నేపథ్యంలో చిత్రాలను రూపొందించే దర్శకుడు పి సునీల్ కుమార్ రెడ్డి శ్రావ్య ఫిల్మ్స్ బ్యానర్ పై సుభాష్ చక్రవర్తి రవడ సహ నిర్మాతగా గే, ట్రాన్స్జెండర్ వ్యక్తుల జీవితాల మీద తీసిన కోర్ట్ రూమ్ డ్రామా “ఎల్ జి బీ టీ – ఏ లీగల్ బ్యాటిల్“. ఈ చిత్రంలో ఎల్ బి శ్రీరామ్, ఎస్తర్ నార్రోన్హ, రాజు ఖేర్, ఆనంద చక్రపాణి , ప్రీతీ నిగమ్ తో పాటు రియల్ ట్రాన్స్జెండర్ యాక్టర్స్ ప్రధాన పాత్రలు పోషించారు. హిమ రాథోడ్ హీరోయిన్ గా చంద్రముఖి , లైలా వంటి ప్రముఖ యాక్టివిస్టులు , గే యాక్టివిస్ట్ విష్ణు తేజ చాలా పరిణితితో నటించారు. “ఎల్ జి బీ టీ – ఏ లీగల్ బ్యాటిల్“ సినిమా ఈ నెల 19న దేశవ్యాప్తంగా విడుదలై మంచి విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో చిత్ర సక్సెస్ మీట్ ను హైదరాబాద్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గే, ట్రాన్స్ జెండర్స్ కు అండగా నిలుస్తున్న పలు సేవా సంస్థల నిర్వాహకులను సత్కరించారు. ఈ సందర్భంగా



నటుడు ఆనంద చక్రపాణి మాట్లాడుతూ – ఎన్నో రకాల సినిమాలు వస్తుంటాయి కానీ ఇలాంటి కథతో సినిమా చేయాలంటే ధైర్యం ఉండాలి. మనం చాలా సమస్యల్ని మనకెందుకు అని చూసీ చూడనట్లు వ్యవహరిస్తుంటాం. ప్రశ్నించాలని అనుకోం. కానీ దర్శకుడు సునీల్ కుమార్ రెడ్డి గారు సినిమా అనే బలమైన మాధ్యమం ద్వారా సొసైటీలో ఉన్న ఈ రుగ్మత గురించి ఆలోచింపజేసేలా సినిమా రూపొందించారు. ఈ సినిమా చూస్తుంటే చాలా సన్నివేశాల్లో కన్నీళ్లు వచ్చాయి. ఇలాంటి మంచి ప్రయత్నాన్ని ప్రేక్షకులు మరింతగా ఆదరించాలి. అన్నారు.

గే కమ్యూనిస్ట్ యాక్టివిస్ట్ విష్ణు మాట్లాడుతూ – మా సినిమా ప్రదర్శితమవుతున్న థియేటర్స్ లో హౌస్ ఫుల్స్ బోర్డ్స్ చూడటం సంతోషంగా ఉంది. సునీల్ కుమార్ రెడ్డిగారు ఒక మంచి విషయాన్ని ప్రేక్షకులకు, సొసైటీకి చెప్పాలని అనుకున్న ఉద్దేశం నెరవేరిందని అనిపిస్తోంది. కాలేజ్ స్టూడెంట్స్, టీచర్స్, పలు ఆర్గనైజేషన్స్ వాళ్లు మా మూవీ చూస్తున్నారు. సినిమా చూశాక వారిలో మా లాంటి వాళ్ల పట్ల ఒక కొత్త పర్సెప్షన్ కనిపిస్తోంది. ఇలాంటి మార్పు రావాలనే సునీల్ కుమార్ రెడ్డిగారు “ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్” సినిమా రూపొందించారు. అన్నారు.

తెలంగాణ స్టేట్ ట్రాన్స్ జెండర్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లైలా మాట్లాడుతూ – “ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్” సినిమాను ఆదరిస్తున్న ప్రేక్షకులకు థ్యాంక్స్ చెబుతున్నాం. నేను ఈ సినిమాలో భాగమవడం సంతోషంగా ఉంది. నాకు ఈ చిత్రంలో నటించే అవకాశం కల్పించిన సునీల్ కుమార్ రెడ్డి  గాకి కృతజ్ఞతలు. మా సమస్యల్ని చెప్పే ఇలాంటి చిత్రాలు మరిన్ని రావాలి. అప్పుడే సమాజంలో మరికొంత మార్పు అనేది మొదలవుతుంది. ఈ సినిమా చూడని వారు తప్పకుండా చూడండి. అన్నారు.

నటుడు వంశీకృష్ణ మాట్లాడుతూ – ఎన్నో సినిమాల ఈవెంట్స్ చూసేందుకు ఇక్కడికి వచ్చినవాడిని. ఇప్పుడు మా సినిమా ఈవెంట్ లో నేను ఈ వేదిక మీద నిల్చుని మాట్లాడటం గర్వంగా ఉంది. మీ సినిమాను ప్రేక్షకులు చూస్తారా అని రిలీజ్ కు ముందు కొందరు అన్నారు. కానీ మంచి ప్రయత్నం చేసిన ప్రతి సినిమాను ఆదరిస్తామని ఆడియెన్స్ మరోసారి ప్రూవ్ చేశారు. అన్నారు.

నటుడు ఎల్బీ శ్రీరామ్ మాట్లాడుతూ – ఈ సినిమాతో సునీల్ కుమార్ రెడ్డి గారు ఒక చరిత్ర సృష్టించారు. గే, ట్రాన్స్ జెండర్ సమస్యలు చెబుతూ వచ్చిన ఫస్ట్ సినిమా ఇదే. ఆ తర్వాత ఎన్ని చిత్రాలు వచ్చినా దీని తర్వాతే. శంకరాభరణం సినిమా ఒక చరిత్ర సృష్టించింది. ఈ అర్థనారీశ్వర సినిమా మరో చరిత్ర సృష్టించబోతోంది. ఈ సినిమాను సింగిల్ స్క్రీన్స్, మల్టిప్లెక్సుల్లో చూశాను. అన్ని వర్గాల ప్రేక్షకులు చూసేందుకు వస్తున్నారు. వీళ్ల ఆర్గనైజేషన్స్, మీడియా, సివిల్ సొసైటీలు, అన్నీ కలిసి “ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్” చిత్రానికి పెద్ద విజయం చేకూర్చాయి. ఇందుకు సునీల్ కుమార్ రెడ్డి గారిని అభినందిస్తున్నా. నా కెరీర్ లో అమ్మో ఒకటో తారీఖు ఎలా గుర్తుండిపోతుందో ఈ “ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్” సినిమా కూడా అలాగే గుర్తుండిపోతుంది. అన్నారు.

ట్రాన్స్ జెంటర్ ఇన్ స్టాగ్రామ్ యాక్టివిస్ట్ హీరోయిన్ హిమ రాథోడ్ మాట్లాడుతూ – గత మూడు రోజులుగా మా “ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్” సినిమాకు మంచి రెస్పాన్స్ వస్తోంది. ఇంత రెస్పాన్స్ ప్రేక్షకుల నుంచి వస్తుందని ఊహించలేదు. నేను సునీల్ కుమార్ రెడ్డిగారు ఇచ్చిన అవకాశంతో ఈ సినిమాలో హీరోయిన్ గా నటించాను. మేము మా జీవితంలో ఎదుర్కొంటున్న సవాళ్లను నా పాత్ర ద్వారా దర్శకుడు సునీల్ కుమార్ రెడ్డి గారు చూపించారు. ఈ సినిమాను మరింతగా సక్సెస్ చేయాలని కోరుతున్నా. అన్నారు.

డైరెక్టర్ పి.సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ – మా “ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్” సినిమాను ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్ చెబుతున్నాం. ఎన్నో ఆర్గనైజేషన్స్, మీడియా మిత్రులు, ఛారిటీ సంస్థలు మా మూవీని ప్రశంసిస్తున్నాయి. ఈ సినిమా రూపొందించడం వెనక ఉద్దేశాన్ని అర్థం చేసుకున్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. ట్రాన్స్ జెండర్స్ విషయంలో ఉన్న వివక్ష తొలగిపోవాలని, వారికీ సమానత్వం ఉండాలని చెప్పేందుకు ఈ “ఎల్ జి బీ టీ ఏ లీగల్ బ్యాటిల్” సినిమాను రూపొందించాను. సినిమా ప్రదర్శితమవుతున్న అన్ని థియేటర్స్ లో మంచి రెస్పాన్స్ రావడం హ్యాపీగా ఉంది. మా మూవీని మరింతగా ఆదరించాలి, ఈ సినిమాతో సొసైటీలో ఒక మంచి మార్పునకు అడుగుపడాలని కోరుకుంటున్నా. అన్నారు.

నటీనటులు – ఎల్ బి శ్రీరామ్, ఎస్తర్ నార్రోన్హ, రాజు ఖేర్, ఆనంద చక్రపాణి , ప్రీతీ నిగమ్, హిమ రాథోడ్, చంద్రముఖి , లైలా, విష్ణు తేజ, తదితరులు

## ది రెడ్ బ్యాగ్’ మూవీ టీజర్ అద్భుతంగా ఉంది – మంత్రి టీజీ భరత్

మెమరీ మేకర్స్ బ్యానర్ మీద హరికృష్ణ సోమిశెట్టి నిర్మాణంలో రవి కుమార్ సీరపు తెరకెక్కించిన చిత్రం ‘ది రెడ్ బ్యాగ్’. ఈ సినిమాలో కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, స్నేహా సింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బాదల్, భార్గవి, రాశీ తదితరులు ముఖ్య పాత్రలను పోషించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన ప్రతీ కంటెంట్ సినిమాపై ఇంట్రెస్ట్‌ను క్రియేట్ చేశాయి. ఆదివారం నాడు ‘ది రెడ్ బ్యాగ్’ టీజర్‌ను ఏపీ ఇండస్ట్రీస్, కామర్స్, ఫుడ్ ప్రాసెసింగ్ మినిస్టర్ టీజీ భరత్ రిలీజ్ చేశారు. ఈ మేరకు నిర్వహించిన టీజర్ లాంఛ్ ఈవెంట్‌లో..



×మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ× .. “ది రెడ్ బ్యాగ్’ టీజర్ అద్భుతంగా ఉంది. మా కర్నూలు నుంచి వచ్చిన హరి గారు తీసిన ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలి. మా రెడ్ బుక్ గురించి ఇండియా వ్యాప్తంగా తెలుసు. అలానే ఈ ‘ది రెడ్ బ్యాగ్’ మూవీ కూడా ఇండియా అంతా సౌండ్ చేయాలి. కర్నూలులోనే అత్యధిక భాగంగా షూటింగ్ చేశారు. కానీ ఫారిన్‌లో తీసినట్టుగా కనిపిస్తోంది. సినిమా టీంకి ఆల్ ది బెస్ట్. ఈ చిత్రం మంచి విజయం సాధించి మా హరికి డబ్బులు బాగా రావాలని కోరుకుంటున్నాను’ అని అన్నారు.

×ప్రముఖ దర్శకుడు నాగేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ× .. “ది రెడ్ బ్యాగ్’ టీజర్ లాంచ్‌కు వచ్చిన టీజీ భరత్ గారికి ధన్యవాదాలు. ఇలాంటి వినూత్న చిత్రాలు తప్పకుండా విజయవంతం అవ్వాలి. హరి గారు ఈ చిత్రం హిట్ అయితే మరిన్ని కొత్త సినిమాల్ని నిర్మిస్తారు. ‘ది రెడ్ బ్యాగ్’ టీజర్ చూసి నేను షాక్ అయ్యాను. నెక్స్ట్ లెవెల్లో సినిమా ఉండబోతోందని అర్థమైంది. ఈ చిత్రం కచ్చితంగా విజయం అవుతుందనే నమ్మకం ఏర్పడింది. ఇదొక ట్రెండ్ సెట్టర్‌గా నిలవాలని కోరుకుంటున్నాను’ అని అన్నారు.

×దర్శకుడు రవి కుమార్ సీరపు మాట్లాడుతూ× .. “ది రైడ్ బ్యాగ్’ చిత్రం లైఫ్ టైం ఇంపాక్ట్ చూపిస్తుంది. ఈ మూవీ చూసిన తరువాత మీరు ఎక్కడ రెడ్ బ్యాగ్‌ని చూసినా మా ‘ది రెడ్ బ్యాగ్’ సినిమా గుర్తుకు వస్తుంది. నా పదహారేళ్ల నిరీక్షణ తరువాత ఈ అవకాశం వచ్చింది. నాకు ఈ అవకాశం ఇచ్చిన హరి గారికి థాంక్స్. మాకోసం ఇక్కడకు వచ్చిన భరత్ గారికి, మాకు సపోర్ట్ చేస్తున్న మీడియాకి థాంక్స్. కథ విన్న వెంటనే హరి గారు ఓకే చెప్పేశారు. మా సినిమాకి కథే హీరో. కర్నూలులో చాలా వరకు రెక్కీ చేశాం. దాదాపు షూటింగ్ అంతా అక్కడే చేశాం. కంటెంట్ బాగుంటే ఆడియెన్స్ హిట్ చేస్తారు. ప్రేక్షకులు పెట్టే డబ్బులకు న్యాయం చేసేలా మా ‘ది రెడ్ బ్యాగ్’ సినిమా ఉంటుంది.’ అని అన్నారు.

×నిర్మాత హరికృష్ణ సోమిశెట్టి మాట్లాడుతూ× .. “ది రెడ్ బ్యాగ్’ సినిమాకి సపోర్ట్ చేసిన ప్రతీ ఒక్కరికీ థాంక్స్. మూవీ చాలా బాగా వచ్చింది. టీజర్ అందరికీ నచ్చే ఉంటుందని భావిస్తున్నాను. త్వరలోనే మూవీ రిలీజ్ కాబోతోంది. అందరూ  సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను’ అని అన్నారు.

×రాధ్య మాట్లాడుతూ× .. “ది రెడ్ బ్యాగ్’ సినిమా విషయంలో హరి గారు, రవి గారు నాకు ఎంతో సపోర్ట్ చేసారు. మేం అందరం కలిసి ఎంతో కష్టపడి చిత్రాన్ని ఫినిష్ చేశాం. మా టీజర్ అందరికీ నచ్చి ఉ ంటుందని భావిస్తున్నాం. త్వరలోనే మా సినిమా రాబోతోంది. అందరూ మా మూవీని చూసి సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను’ అని అన్నారు.

×ఆకాంక్ష మాట్లాడుతూ× .. “ది రెడ్ బ్యాగ్’ చిత్రంలో నాకు అవకాశం ఇచ్చిన హరి గారికి, రవి గారికి థాంక్స్. టీం అంతా కలిసి ఎంతో కష్టపడి సినిమాని చేశాం. అందరి సమిష్టి కృషి వల్లే ఈ స్థాయిలో మూవీ వచ్చింది. మా టీజర్ అందరికీ నచ్చే ఉంటుందని భావిస్తున్నాను. త్వరలోనే మా సినిమా రానుంది. అందరూ చూసి సపోర్ట్ చేయండి’ అని అన్నారు.

×మోనిక మాట్లాడుతూ× .. ‘హరి గారు, రవి గారు లేకపోతే ‘ది రెడ్ బ్యాగ్’ చిత్రం ఇంత బాగా వచ్చేది కాదు. మాకు ఈ అవకాశం ఇచ్చిన వారిద్దరికీ థాంక్స్. సినిమా బాగా వచ్చింది. త్వరలోనే మా మూవీ రిలీజ్ కాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేయండి’ అని అన్నారు.

×డైరెక్టర్ అహిషోర్ మాట్లాడుతూ× .. ‘హరి నాకు మంచి స్నేహితుడు. ‘ది రెడ్ బ్యాగ్’ సినిమా సక్సెస్ ఫుల్‌గా పూర్తి చేశాడు. టీజర్ బాగుంది. చిత్రయూనిట్‌కి ఆల్ ది బెస్ట్. ఈ మూవీ పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను’ అని అన్నారు.

×నటుడు ప్రసాద్ బెహరా మాట్లాడుతూ× .. “ది రెడ్ బ్యాగ్’ చిత్రంలో నాకు అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. ఇందులో నాది, కబీర్ సింగ్ ట్రాక్ బాగుంటుంది. ఓ బ్యాగ్ చుట్టూ తిరిగే కథ మాత్రమే కాదు.. ఎన్నో భావోద్వేగాలతో సినిమా నిండి ఉంటుంది. ఈ మూవీ పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నాను’ అని అన్నారు.

×లిరిక్ రైటర్ తిరుపతి మాట్లాడుతూ× .. “ది రెడ్ బ్యాగ్’ చిత్రంలో నేను రెండు పాటలు రాశాను. టీజర్ బాగుంది. నాకు ఈ అవకాశం ఇచ్చిన హరి గారికి, రవి గారికి థాంక్స్. ఈ చిత్రం మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను’ అని అన్నారు.

×రైటర్ హరి ప్రసాద్ మాట్లాడుతూ× .. “ది రెడ్ బ్యాగ్’ సినిమాలో మంచి కథ ఉంటుంది. నాకు ఈ అవకాశం ఇచ్చిన నిర్మాత హరి గారికి థాంక్స్. ఈ మూవీ మంచి సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను’ అని అన్నారు.

×నటీనటులు× : కబీర్ సింగ్, ప్రసాద్ బెహరా, రాధ్య, మోనిక, స్నేహా సింగ్, ఆకాంక్ష, ఈషాన్ శంకర్, అవినాష్ బాదల్, భార్గవి, రాశీ తదితరులు

Printed by Published by **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH** on behalf of **KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH**, Printed at and Published at 1-7-750/1-3, F 103 and 102, ST. PIOUS SCHOOL ROAD, Sruthi Sadan Apts, Ramnagar, Hyderabad-500020, Telangana. Editor **RAGHURAMA RAJU KALIDINDI.** PRGI NUMBER TGTEL/25/A3603, CELL : 9849379430, MAIL ID: kingdailynewspaper@gmail.com